ఈనాడు
అమరావతి
గుంటూరు
సోమవారం మే 1, 2023

పెళ్లి కల వచ్చేసింది..

- ఈనెల 3 నుంచి వివాహ ముహూర్తాలు
- జూన్ 14 వరకు మోగనున్న బాజా



సత్తెనపల్లి, న్యూస్‌టుడే

పెళ్లంటే పండగే. రెండు జంటల కలయిక ఎన్నో కుటుంబాల్లో సంతోషాల్ని నింపడమే కాదు.. 20 నుంచి 25 రంగాలకు చెందిన వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది. గత మార్చి 28వ తేది నుంచి గురు మూఢమితో ఆగిన పెళ్లి బాజాలు ఈనెల 3వ తేది నుంచి మళ్లీ మోగబోతున్నాయి. మే, జూన్ నెలల్లో ఎక్కువ ముహూర్తాలు ఉన్నాయి. జూన్ 14వ తేది తరువాత మళ్లీ ఆగస్టు 18వ తేది వరకు శుక్ర మూఢమి కారణంగా పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు లేవు. దీంతో వేసవిలోనే పెళ్లి తంతు పూర్తి చేయాలని వధూవరుల కుటుంబాలు ఇప్పటికే ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నాయి. మే నెలలో 3, 4, 5, 6, 7, 10, 11, 12, 13, 14, 20, 21, 26, 27, 31 తేదిల్లో, జూన్‌లో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 14 తేదిల్లో వివాహ ముహూర్తాలు ఉన్నట్లు ప్రముఖ పురోహితుడు పులుపుల ఫణికుమార్‌శర్మ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మే నెల 10, 11, 12, 13 తేదిల్లో వేల సంఖ్యలో వివాహాలు నిశ్చయమైనట్లు ఆయన తెలిపారు. ఎక్కువ మందికి సరిపోయే నక్షత్రాలు జూన్ 7, 8, 9 తేదిల్లో ఉండటంతో ఆ రోజుల్లోనూ పెళ్లిళ్లు ఎక్కువ జరగబోతున్నట్లు చెప్పారు. జూన్ 14 తరువాత పెళ్లి ముహూర్తాల కోసం ఆగస్టు 18వ తేది వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. వచ్చే నెలలో సగం రోజులు వివాహాలకు కల్యాణ మండపం బుక్ అయినట్లు సత్తెనపల్లికి చెందిన ఓ మండపం నిర్వాహకుడు తెలిపారు. మండపాలు, ఈవెంట్ ఆర్గనైజర్లు, క్యాటరింగ్, వస్త్ర వ్యాపారులు, బంగారం, వెండి వ్యాపారాలు, అలంకరణ, రవాణా వాహన యజమానులు, మేళతాళ ట్రూపులు, డీజేలు, టెంట్‌హౌస్‌లకు మంచి డిమాండ్ రాబోతుంది.

ఈనాడు-అమరావతి

ఔషధాలేవీ?

ఇండెంట్లు తీసుకుని పంపిణీ మరిచారు
సీడీఎస్ నిర్వాకంపై విమర్శలు

ప్రభుత్వ ఆసుపత్రులకు ఔషధాలు, సర్జికల్స్‌కు సంబంధించి ప్రతి మూడు మాసాలకు ఒకసారి బడ్జెట్ కేటాయింపులు జరుపుతారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో(ఏప్రిల్-జూన్) ఇవ్వాల్సిన మందులు ఇప్పటివరకు ఇవ్వలేదు. ఇండెంట్ మేరకు ఆసుపత్రులకు అందించాల్సిన ఔషధాలు, సర్జికల్స్ పంపకుండా ఔషధ భాండాగార యంత్రాంగం(సెంట్రల్ డ్రగ్ స్టోర్: సీడీఎస్) చోద్యం చూస్తోంది. తొలి త్రైమాసికంలో నెల రోజులు గడిచినా మందులు ఇవ్వకపోవడం గమనార్హం. మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికానికి అందజేసిన మందుల్లో మిగిలినవి రోగులకు అందజేస్తున్నారు. లేని మందులు బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు.

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 200 సర్కారీ దవాఖానాలకు గుంటూరులోని సీడీఎస్ నుంచే మందులు సరఫరా అవుతాయి. మొదటి త్రైమాసిక మందుల ఇండెంట్ పెట్టుకోవటానికే ఈ-ఔషధి యాక్సెస్ ఇవ్వటంలోనే కొంత ఆలస్యం జరిగింది. తీరా ఇండెంట్ తీసుకుని కూడా మందులు సరఫరా చేయకుండా జాప్యం చేయటంపై విమర్శలు వస్తున్నాయి. సెంట్రల్ డ్రగ్‌స్టోర్స్‌లో ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన ఈఈతో పాటు డీఈ, ఏఈ, స్టోర్స్‌లో మందుల పంపిణీకి ముగ్గురు ఫార్మాసిస్టులు, పదుల సంఖ్యలో కింద స్థాయి సిబ్బంది ఉంటారు. ఇంతమంది ఉద్యోగులు ఉన్నా అవసరమైన మందులను ప్రధాన కార్యాలయం నుంచి సకాలంలో సమకూర్చుకుని వాటిని ఆసుపత్రులకు పంపే విషయంలో ప్రణాళిక లోపించిందనే విమర్శలను సీడీఎస్ మూటగట్టుకుంటోంది. కీలకమైన గుంటూరు ప్రభుత్వ బోధనాసుపత్రి, తెనాలి జిల్లా ఆసుపత్రి, నరసరావుపేట, బాపట్ల జిల్లా కేంద్రాల్లోని ప్రాంతీయ వైద్యశాలలన్నింటికి ఇక్కడి నుంచే మందులు సరఫరా చేయాలి. ఏ త్రైమాసికంలో ఇవ్వాల్సిన మందులను ఆ వ్యవధిలో ఇస్తే వాటి వినియోగం కూడా సక్రమంగా జరిగి ప్రజలకు మందులపరంగా అవస్థలు తప్పుతాయి. మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికానికి సంబంధించిన మందులకు ఆ నెల చివరి దాకా ఇండెంట్ తీసుకున్నారు. మందులు ఇచ్చినట్లు కంప్యూటర్‌లో అదే నెలలో బిల్లులు తీశారు. ఆర్థిక సంవత్సరం మారితే తేదీ మారిపోతుందని ముందుగానే అధికారులు అప్రమత్తమై బిల్లులైతే తీశారు కానీ మందులు మాత్రం ఏప్రిల్‌లో పంపిణీ చేశారు. ఒకవైపు ప్రభుత్వం ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ఆసుపత్రులకు ఏ మందులు అవసరమైతే వాటన్నింటిని టెండర్ల ద్వారా సమకూర్చుకుని సీడీఎస్‌లకు పంపుతున్నామని చెబుతోంది. సకాలంలో మందులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చకుండా జాప్యం ఎందుకు చేస్తున్నారు.. అందుకు బాధ్యులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పేరుకుపోయిన ప్రోగ్రామ్స్ మందులు

వేసవి కాలంలో ఇచ్చే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐరన్ మాత్రలతో పాటు జాతీయ ఆరోగ్య మిషన్ ఇచ్చే పలు రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన మందులు సీడీఎస్‌లో భారీగా పేరుకుపోయాయి. వాటిని వైద్య, ఆరోగ్యశాఖ తీసుకెళ్లి ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉండగా వాటిని ఇక్కడే ఉంచుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



గుంటూరులోని సెంట్రల్ డ్రగ్ స్టోర్స్

తక్కువ వస్తున్నాయని ఆరోపణలు

గుంటూరు నగరానికి సుదూరాన ఉన్న ఆసుపత్రుల ఉద్యోగులు ఇండెంట్ మేరకు అన్ని మందులు సక్రమంగా ఇచ్చారా? లేదా అని చెప్పి తనిఖీ చేసుకుని తీసుకెళ్లే పరిస్థితి ఉండదు. స్టోర్‌లో ఉండే ఫార్మాసిస్టులకు చూసి మందులు పంపాలని కోరడం వారు ఇండెంట్ బిల్లులు దగ్గర పెట్టుకుని అన్ని మందులు ప్యాకింగ్ సిబ్బంది బండిలో పెడుతున్నారా లేదా అనేది పరిశీలించకుండా పంపుతున్నారు. కొన్ని రకాల మందులు స్టోర్‌లో కనిపించక పోతే వాటిని పంపించటం లేదు. తీరా ఆసుపత్రిలో ఫార్మాసిస్టులు మందులు లెక్కేసుకుంటే కొన్ని మందులు తగ్గుతున్నాయని చెబుతున్నారు.

ఇండెంట్ పెట్టాక 45 రోజులు పడుతుంది

-శ్రీధర ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్, ఏపీఎంఎస్ఐడీసీ, గుంటూరు

నాలుగో క్వార్టర్స్‌లో ఇచ్చిన మందులే చాలా చోట్ల వినియోగం కాకుండా మిగిలాయి. ఇండెంట్ స్వీకరించిన తర్వాత వాటిని ప్రధాన కార్యాలయానికి పంపి అవి కొనుగోలు చేసి ఇవ్వటానికి 45 రోజులు పడుతుంది. ఏదైనా ఆసుపత్రి మందులు కోరితే ఇండెంట్‌తో సంబంధం లేకుండా స్టోర్స్‌లో ఉన్నవి పంపుతున్నాం. మందుల కొరత అనేది లేదు. అన్ని రకాలవి ఉన్నాయి. అయితే కొన్ని ఆసుపత్రులు ఔషధాల కన్నా సర్జికల్స్ ఎక్కువ ఇవ్వాలని కోరుతున్నాయి. ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రోగ్రామ్స్ మందుల్లో ఐరన్ సిరప్ కొంత ఆలస్యంగా రావటం వల్ల అవి మాత్రమే స్టోర్స్‌లో ఉన్నాయి. మందులు తగ్గుతున్నాయని ఎవరూ చెప్పలేదు.

రైతు శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న విజయకుమార్, చిత్రంలో మురళీధర్, డాక్టర్ వరప్రసాద్

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో 1000 మంది రైతు శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రైతు సాధికార సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయం విస్తరణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 200 మంది మెంటార్లకు 7 రోజుల శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ పులివెందులలో ఏర్పాటు చేసిన ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకలాజికల్ రీసెర్చి అండ్ లెర్నింగ్ (ఐజీజీఏఏఆర్ఎల్) ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి కీలక పాత్ర పోషించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా చూడాలని సూచించారు. రైతు శాస్త్రవేత్తల కోర్సు వ్యవధి 4 సంవత్సరాల 2 నెలలు ఉంటుందన్నారు. వీటిలో 8 సెమిస్టర్లు, 250 క్రెడిట్లు(స్కోర్) ఉంటాయన్నారు. సొంత పొలంతోపాటు ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించేలా రైతు శాస్త్రవేత్తలకు శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణకు హాజరైన మెంటార్ల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి కోర్సుకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్లు మురళీధర్, డాక్టర్ వరప్రసాద్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు జాకీర్‌హుస్సేన్, ధర్మేంద్ర, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండాకాలం

	గరిష్ఠ	కనిష్ఠ
గుంటూరు	33.0	25.0
తెనాలి	29.8	25.7
రెంటచింతల	36.0	24.0
సత్తెనపల్లి	34.0	25.0
మంగళగిరి	36.0	24.0

ట్రాన్స్‌కో ఎస్ఈగా శ్రీనివాసరావు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: ట్రాన్స్‌కో గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరుగా కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం కార్యనిర్వాహక ఇంజినీరు(టెక్నికల్)గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎస్ఈగా పనిచేస్తున్న పూర్ణచంద్రరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో శ్రీనివాసరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'అసమర్థ నిర్ణయాలతో దిగజారిన ఆర్థిక స్థితి'



వెలగపూడిలో నినాదాలు చేస్తున్న అన్నదాతలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అసమర్థ నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక స్థితి, రాష్ట్ర రాజధానిని పాలకులు దిగజార్చారని అమరావతి రైతులు మండిపడ్డారు. అనుకున్న రీతిలో అమరావతి నిర్మించి ఉంటే వివిధ అంతర్జాతీయ కంపెనీలు రాజధానిలో సంస్థలు స్థాపించి ఉండేవని, ఫలితంగా అమరావతి అభివృద్ధి ఉన్నత స్థితిలో ఉండేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయా కంపెనీలు హైదరాబాద్‌లో ప్రధాన కేంద్ర కార్యాలయాలను, శాఖలను ఏర్పాటు చేసుకున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు రూ.55 వేల కోట్ల వ్యాపారం జరుగుతున్న మిర్చి పంటకు ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పితే లక్ష కోట్ల రూపాయలకు పైగా ఆదాయం లభించి 50 వేల మందికి జీవన భృతి లభించేదని అన్నారు. కొండపల్లిలో ఖర్జూర్ స్టీల్ పార్కు నెలకొల్పితే 15 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేసి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచితే.. 2 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో 16 ఆగ్రో ప్రోసెసింగ్ క్లస్టర్లు, 12 ఇండస్ట్రియల్ క్లస్టర్లు నెలకొల్పే అవకాశం, సామర్థ్యం ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమరావతి నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి మీద దృష్టి పెట్టి ఉంటే అప్పులు చేసి పాలన చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ఇదే విధంగా పాలన కొనసాగిస్తే చరిత్ర హీనులుగా మిగిలి పోతారని అన్నారు. చేతకాని పాలనతో రాష్ట్రంలో బిహార్ కన్నా దారుణమైన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమరావతిలో అన్నదాతలు చేస్తున్న నిరసనలు 1230వ రోజుకు చేరాయి. వెంకటపాలెం, మందడం, వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, దొండపాడు, తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, తాడికొండ తదితర గ్రామాల్లో నిరసనలు కొనసాగాయి.

మహాలక్ష్మీ నమోస్తుతే!



గుంటూరు అరండల్ కాలనీ 27వ వీధిలో మహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. -న్యూస్‌టుడే, నెహ్రూనగర్

వర్షం తెచ్చిన కష్టం



అకాల వర్షాలతో రైతులు అల్లాడుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఆదివారం గంటపాటు వాన కురవడంతో ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో కల్లంలో ఆరబోసిన మిర్చిపై పట్టాలు కప్పుతూ అన్నదాతలు ఇలా కనిపించారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

క్వారీల్లో డీజిల్ బాంబులు

అనధికారికంగా బంకులు.. వేల లీటర్ల ఇంధనం నిల్వ

నిర్వాహకులు బడాబాబులు కావడంతో కన్నెత్తి చూడని యంత్రాంగం



ఈనాడు, గుంటూరు

గ్రానైట్ క్వారీల్లో నిర్వాహకులు అనధికారికంగా డీజిల్ బంకులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వేల లీటర్ల డీజిల్ నిల్వ చేస్తున్నారు. ప్రమాదాలు సంభవించినా నివారించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. క్వారీలు అధికార పార్టీ నేతలు, బడా వ్యాపారులవి కావటంతో తనిఖీ చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. నెలవారీగా కమీషన్లు దండుకుంటూ క్వారీల చుట్టుపక్కలకే వెళ్లడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదుల సంఖ్యలో గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఇక్కడి నుంచి భారీగా ముడి గ్రానైట్ రాళ్లు తీసి పలకల పరిశ్రమలకు పంపిస్తున్నారు. క్వారీల నుంచి ముడి రాయి ఫ్యాక్టరీలకు తరలించడానికి పెద్ద లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. క్వారీల్లో ముడి రాయి తీయడానికి భారీ క్రేన్లు, జనరేటర్లు, జేసీబీలు, పొక్లెయినర్లు, బుల్‌డోజర్లు వినియోగిస్తున్నారు. మైనింగ్ పగలు, రాత్రులు 24 గంటలూ జరుగుతోంది. జనరేటర్ల ద్వారా నిరంతరం కరెంటు సరఫరా చేయాల్సి ఉంది. 40 టన్నుల నుంచి 80 టన్నుల రాళ్లను భారీ క్రేన్ల సాయంతో క్వారీ నుంచి తీసి లారీలో పెడతారు. క్వారీల్లో వాహనాలు, యంత్రాలకు రోజూ వేల లీటర్లలో డీజిల్ కావాల్సి ఉంటుంది.

కాకినాడ నుంచి ప్రైవేటు వ్యాపారులు ట్యాంకర్లలో డీజిల్‌ను గ్రానైట్ వ్యాపారులకు పంపిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ విక్రయించే ప్రభుత్వ రంగ సంస్థల కన్నా లీటర్‌కు రూ.రెండు నుంచి రూ.నాలుగు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. గ్రానైట్ క్వారీల్లో భారీగా డీజిల్ అవసరం కావటంతో ట్యాంకర్ల ద్వారా వ్యాపారులు తెప్పించి నిల్వ చేస్తున్నారు. కొందరు క్వారీల వద్దే సొంతంగా ట్యాంకర్లు ఏర్పాటు చేసుకుని అందులో డీజిల్ ఉంచుతున్నారు. డ్రమ్ముల్లోనూ నిల్వ చేస్తున్నారు. వేల లీటర్ల డీజిల్ నిల్వ చేయాలంటే రెవెన్యూ శాఖ నుంచి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సి ఉంది. ప్రమాదాలు సంభవించకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలి.

అనుమతుల ఊసేలేదు

బల్లికురవలోని కొండాయపాలెం వద్ద పది క్వారీల్లో రెండింటిలో మాత్రమే డీజిల్ నిల్వలకు అనుమతులు ఉన్నాయి. మిగిలిన వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండానే వేల లీటర్ల డీజిల్ నిల్వ చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే, భారీ నష్టం జరగకుండా నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అధికార వైకాపా నేతలు, బడా వ్యాపారుల క్వారీలు కావటంతో తనిఖీలు చేయాల్సిన అధికారులు అటువైపే వెళ్లటం లేదు. కొందరికి ప్రతి నెలా ముడుపులు అందుతున్నాయి. ఎవరైనా తనిఖీ చేయడానికి ప్రయత్నించినా అధికార బలంతో అడ్డుకుంటున్నారు.

సిమెంటు గడ్డ కట్టింది!

నాడు-నేడు పనులు ఎలా చేపట్టాలి?
ప్రధానోపాధ్యాయుల్లో ఆందోళన

ఈనాడు-అమరావతి



తిక్కిరెడ్డిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తికాని పనులు

పాఠశాలల్లో నాడు-నేడు పనులను వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలి. వాటి నిర్మాణాలకు అవసరమైన నిధులు ఇప్పటికే జమ చేశామని పాఠశాల విద్యాశాఖ యంత్రాంగం చెబుతున్నా ఆ పనుల నిర్వహణకు సిమెంటు సమస్య పెద్ద అవరోధంగా మారింది. సుమారు అయిదారు మాసాల నుంచి నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. పాఠశాలలకు సిమెంటు సరఫరా చేసి కూడా నాలుగైదు నెలలు గడిచింది. దీంతో అది బాగా గడ్డలు కట్టి వినియోగానికి పనికిరాకుండా పోయిందని దాంతో నిర్మాణాలు చేపడితే నాణ్యత లోపిస్తుందని కొందరు ప్రధానోపాధ్యాయులు చెబుతుండగా మరికొందరు అసలు సిమెంటే చాలా స్కూళ్లల్లో లేదని అంటున్నారు. దాని కోసం ఇండెంట్ పెట్టి పది-పదిహేను రోజులు కావస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి కదలిక లేదు. సిమెంటు లేకుండా పనులు చేపట్టలేం కదా? ఇండెంట్ పెట్టిన వెంటనే దాన్ని సమకూరిస్తే జాప్యం లేకుండా పనులు ప్రారంభించొచ్చని హెచ్‌ఎంలు అంటున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కలిపి సుమారు 800కు పైగా పాఠశాలల్లో రెండో దశలో పనులు ప్రారంభించారు. మొదటి దశలో చేపట్టిన పాఠశాలల్లో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఇవన్నీ వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. చాలా చోట్ల సిమెంటు లేక పనులు మొదలెట్టలేని పరిస్థితి నెలకొంది. సిమెంటు బస్తాలే కాదు కిటికీలు కూడా లేవని పలువురు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఆయా పనుల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ లేకుండా పనులు పూర్తి చేయాలని గడువు పెడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అంటున్నారు.

తగ్గిన ఇనుముకు బాధ్యులెవరు?

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలల్లో ఇనుము నిర్దేశిత పరిమాణం మేరకు పాఠశాలలకు చేరలేదు. సరఫరాదారుడు మాత్రం తాను అన్ని స్కూల్స్‌కు పంపానని తనకు సంబంధం లేదని అంటున్నారు. కొత్తగా ఆయా పాఠశాలలకు హెచ్‌ఎంలుగా వెళ్లిన వారు ప్రస్తుతం చేపట్టబోయే పనులకు ఎంత సిమెంటు, ఇనుము అవసరమో లెక్కలు తీస్తే ఉండాల్సిన స్థాయిలో ఇనుము లేదని, కనీసం రెండు, మూడు టన్నులు తేడా ఉందని ప్రధానోపాధ్యాయుడొకరు చెప్పారు. పొరపాటు ఎక్కడ జరిగింది? దీనికి బాధ్యులెవరనేది గతంలో హెచ్‌ఎంలుగా ఉన్నవారు, తల్లిదండ్రుల కమిటీయే చూసుకోవాలని తనకేం సంబంధం లేదని పేరెంట్స్ కమిటీతో ఒక తీర్మానం చేయించుకుని కొత్తగా పనులు ప్రారంభించటానికి తమ పాఠశాలలో చర్యలు తీసుకున్నట్లు సదరు హెచ్‌ఎం చెప్పారు. ఇక్కడ ఒక్కచోటే కాదు చాలా పాఠశాలల్లో ఇనుము లెక్కల విషయంలో బాగా వ్యత్యాసాలు ఉన్నాయని దాని పంపిణీ సమయంలో బరువు ఎంత ఉందో చూసుకోలేదని ఇదే అదనుగా మోసాలకు పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

'జగన్ పాలనలో విధ్వంసాలు, అరాచకాలే'



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న శ్రావణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, రవీంద్ర, మహమ్మద్ నసీర్ తదితరులు

పట్టాభిపురం (గుంటూరు), న్యూస్‌టుడే: జగన్ నాలుగు సంవత్సరాల పాలనంతా విధ్వంసాలు, హత్యలు, అక్రమాలు, అరాచకాలు, అవినీతి, కక్ష సాధింపులతో సాగిందని జిల్లా తెదేపా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జగనాసుర అవినీతి, నేర రాక్షసుడు పోస్టర్‌ను తెదేపా నేతలు ఆవిష్కరించారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసాలకు శ్రీకారం చుట్టిన జగన్ పాలనలో అభివృద్ధిని అటకెక్కించారు. నవరత్నాల పేరిట పేదలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం చేసే తప్పుడు పనుల్ని ప్రశ్నిస్తే ప్రతిపక్షపార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి అక్రమ అరెస్టులు చేయిస్తున్నారు. దోపిడీ, భూదందాలకు కేరాఫ్‌గా నిలిచారని మండిపడ్డారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగంలో నూతన ఒరవడి అంటూ బైజూస్ పేరుతో దోచుకుంటున్నారు. విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకున్నారు. మూడేళ్లగా ఈ పథకాన్ని అటకెక్కించారన్నారు. గుంటూరు పశ్చిమ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ రాజధాని అమరావతిని నాశనం చేశారన్నారు. గుంటూరు తూర్పు ఇన్‌ఛార్జ్ మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముస్తఫాకు ప్రజల సమస్యలు, నియోజకవర్గం అభివృద్ధి ఏమాత్రం పట్టడం లేదన్నారు. తెదేపా నాయకులు పోతినేని శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, రావిపాటి సాయికృష్ణ, నూతలపాటి రామారావు, గుడిమెట్ల దయారత్నం, కసుకుర్తి హనుమంతురావు, మహంకాళి నరసింహారావు, గుడిపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసినా ఆగని మట్టి అక్రమ తవ్వకాలు

వీఎన్‌పాలెం(చేబ్రోలు), న్యూస్‌టుడే : అసైన్డు, ప్రభుత్వ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. అధికారులు ఎన్నిసార్లు దాడి చేసినా అక్రమార్కులకు చీమ కుట్టినట్లు కూడా ఉండడం లేదు. రెండు రోజులు నిలిపేసినట్లు నటించడం మళ్లీ తవ్వకాలు చేయడం ఇక్కడ షరా మామూలయ్యాయి. 'అనుమతి గోరంత.. తవ్వేది కొండంత' శీర్షికన గత నెల 25న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. 26వ తేదీన మైనింగ్ ఏడీ రంగకుమార్ వీఎన్ పాలెంలో అక్రమ క్వారీలను పరిశీలించారు. అధికారులు వస్తున్న విషయంపై ముందే సమాచారం అందడంతో తవ్వే ప్రాంతం నుంచి పొక్లెయిన్‌లు మరో ప్రాంతానికి తరలించారు. అక్రమ క్వారీలపై నిఘా పెడతామని అధికారులు తెలిపారు. తాజాగా శనివారం రాత్రి నుంచి మళ్లీ అసైన్డు భూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండదండలతోనే అక్రమ క్వారీయింగ్ జరుగుతుండటంతో అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేక పోతున్నారనే విమర్శలొస్తున్నాయి.



వీఎన్‌పాలెంలో అసైన్డు భూముల్లో జరుగుతున్న తవ్వకాలు

తెదేపా అధికారంలోకి రావడం ఖాయం : ధూళిపాళ్ల

పట్టాభిపురం(గుంటూరు),న్యూస్‌టుడే: జగన్ పాలనపై ప్రజలు విసిగిపోయారని మాజీ ఎమ్మెల్యే, తెదేపా సీనియర్ నాయకులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. నంబూరుకు చెందిన పలువురు వైకాపా నాయకులు ఆదివారం గుంటూరులోని నరేంద్ర కార్యాలయంలో ఆయన సమక్షంలో తెదేపాలో చేరారు. నరేంద్ర వారికి తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ నంబూరు గ్రామం తెదేపా హయాంలో రాజధాని అమరావతి అనుకున్నప్పుడు ఎలా ఉంది. జగన్ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా ఎలా ఉందో ప్రతి ఒక్కరూ బేరీజు వేసుకోవాలి. తెదేపా అధికారంలోకి రావడం ఖాయం. రాజధానిగా అమరావతి కొనసాగుతుంది. అందరి భవిష్యత్తు బాగుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. వాలంటీర్ల వ్యవస్థ గురించి గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు అదనంగా ఒరిగిందేమీ లేదు. వైకాపా కోసమే వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆదిరెడ్డి వాసు విషయంలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. మే 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే మహానాడు కార్యక్రమానికి అడ్డంకులు కలగజేయడమే ప్రభుత్వ ఉద్దేశం. అధికారులు మారినా సీఐడీ తీరు మారలేదని మండిపడ్డారు. మహేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరికృష్ణారెడ్డి, ఆదర్శ్ వీరారెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, నవీన్‌రెడ్డితో పాటు మొత్తం 30 కుటుంబాలకు చెందిన 150 మందికి పైగా తెదేపాలో చేరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వలివేటి మురళీకృష్ణ, జయరామిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, మోసిన్, సుశీలరావు, పాశం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

జగన్ పాలనకు గడపగడపలో తిరస్కారం: జనసేన

బ్రాడీపేట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ అరాచకాలను 80 శాతం ప్రజలు వ్యతిరేకిస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వైకాపా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం ప్రచార యాత్ర ప్రజల ఆదరణ కోల్పోయిందన్నారు. ప్రజల్ని అదిరించి, బెదిరించి గోడలకు అతికించిన స్టిక్కర్లను 80 శాతం ప్రజలు పీకేశారన్నారు. నాలుగేళ్ల జగన్ పాలనను ప్రజలు గడప గడపలో తిరస్కరిస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని వాలంటీర్లతో, గృహ సారథులతో కలిసి వైకాపా నేతలు ప్రజలకు ఇష్టం లేకున్నా స్టిక్కర్లను అంటించడం హేయమన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలను వినకపోగా శాసనసభ్యుడి స్థాయి నేతలు కూడా భౌతిక దాడులకు తెగబడడం వైకాపా అరాచక పాలనకు పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. వైకాపా నేతలు చేస్తుంది పీపుల్ సర్వే కాదని, పొల్ సర్వే అని విమర్శించారు.

'నేతన్న నేస్తం అందడం లేదు'

వీర్రాజు దృష్టికి తీసుకెళ్లిన చేనేత కార్మికులు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో చేనేత కార్మికులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మగ్గాలను ఆదివారం పరిశీలించారు. వస్త్రం తయారు చేసే విధానాన్ని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. స్టాండ్ మగ్గంపై కూర్చొని నేసేందుకు ప్రయత్నించారు. నేతన్న నేస్తం పథకం తమకు అందడం లేదని కార్మికులు వివరించారు. సొంత మగ్గం ఉన్న వారికే పథకం వర్తిస్తోందని, లేనివారికి కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు సహకరించాలని కోరారు. చేనేత కార్మికులకు రూ.10 వేల రాయితీతో రూ.50 వేల రుణం బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని, వినియోగించుకోవాలని సూచించారు. నాయకులు బిట్రా శివనారాయణ, పాటిబండ్ల రామకృష్ణ, పంచుమర్తి ప్రసాద్, తులిమిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



మగ్గంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

వివాహిత అదృశ్యం.. వాలంటీర్‌పై కేసు

తెట్టపాలెం(నేపోలు), న్యూస్‌టుడే : గ్రామ వాలంటీర్ వివాహితను మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన ఘటన చేబ్రోలు మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితకు తోట్టపాలెం గ్రామానికి చెందిన వాలంటీర్ విజయ్ కొన్ని రోజులుగా మాయ మాటలు చెబుతున్నాడు. ఆమె అతనితో చనువుగా ఉంటోంది. గమనించిన భర్త ఆమెను మందలించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున వాలంటీర్ తన భార్యను తీసుకెళ్లాడని బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్ బటన్ నొక్కి నెలైనా..

ఖాతాల్లో జమ కాని నిధులు

ఆసరా నిధులకు స్వయం సహాయక సంఘాల మహిళల నిరీక్షణ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా నిరుపేద వర్గాల సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వం సాయం అందజేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మొదలు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. సీఎం జగన్ బటన్ నొక్కిన వెంటనే మీ ఖాతాల్లో నగదు జమవుతుందని వేదికలపైనే ప్రకటిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం ఇది అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. వైఎస్ఆర్ ఆసరా మూడో విడత ఆర్థిక సాయం కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభించి నెల రోజులు దాటినా ఎస్‌హెచ్‌జీ మహిళలకు పూర్తి స్థాయిలో వారి ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

సీఎం జగన్ ఏలూరు జిల్లా దెందులూరులో ఆసరా సాయం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత మార్చి 25 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆసరా మహోత్సవాలను మండలాల్లో నిర్వహించారు. ఎమ్మెల్యేలు నమూనా చెక్కులు కూడా అందజేశారు. మండలాల్లో ఆసరా మహోత్సవాలను నిర్వహించిన తర్వాత డీఆర్‌డీఏ- వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులు ఆయా మండలాల్లోని ఎస్‌హెచ్‌జీల బ్యాంకు ఖాతాల్లో ఆసరా సాయానికి సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 19,163 ఎస్‌హెచ్‌జీల్లోని 1,89,443 మంది మహిళలకు రూ.163.71 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈనెల 27వ తేదీకి 11,800 ఎస్‌హెచ్‌జీల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.90 కోట్లు జమ చేసినట్లు డీఆర్‌డీఏకి బ్యాంకుల నుంచి సమాచారం అందింది. మరో 7,363 ఎస్‌హెచ్‌జీల్లోని 73 వేల మందికి సాయం అందలేదు. మండలాల్లో కొన్ని సంఘాలకు నిధులు జమయి.. మరికొన్ని సంఘాలకు అందకపోవడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. మండలాల్లో నిర్వహించిన ఆసరా మహోత్సవ కార్యక్రమాలకు హాజరైతేనే మీ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామని పనులు మానుకుని వెళ్లామని, ఇప్పటికీ నిధులు జమ కాలేదని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద మహిళలు ప్రభుత్వం అందించే సాయం కోసం రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఎండలు పెరిగిపోవడం, వాతావరణంలో మార్పులు రావడంతో బ్యాంకులకు వెళ్లి ఇళ్లకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



వట్టిచెరుకూరులో ఎస్‌హెచ్‌జీ మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత (పాతచిత్రం)

నిధుల సమస్యే కారణం

ఎస్‌హెచ్‌జీ మహిళలకు వైఎస్ఆర్ ఆసరా సాయం పథకంలో నిధుల సమీకరణ సమస్యగా మారిందని సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల నిధులను ఆయా వర్గాల మహిళలకు కేటాయిస్తున్నారు. ఆ కార్పొరేషన్లలో నిధులు పరిమితంగా ఉండటంతో సర్దుబాటు చేయడం ఇబ్బందిగా మారింది. రంజాన్ పండగకు ముందు మైనార్టీ కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించడంతో ముస్లిం ఎస్‌హెచ్‌జీ మహిళల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఓసీ సామాజిక వర్గాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ సంఘాలకు నిధులు జమ కాలేదు. వీరికి నిధులను సమకూర్చడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో ఎస్‌హెచ్‌జీలకు ఆసరా సాయం అందలేదు. దాంతో డీఆర్‌డీఏ- వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ మహిళలు ప్రదక్షిణలు చేస్తున్నారు. సీఎం జగన్ బటన్ నొక్కి నెల రోజులు దాటినా ఆసరా సాయం అందకపోవడంతో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కువ సంఘాలకు జమయ్యాయి

జిల్లాలో ఎక్కువ ఎస్‌హెచ్‌జీలకు వైఎస్ఆర్ ఆసరా సాయం అందజేశాం. వారి ఖాతాల్లో నిధులు జమయ్యాయి. ఇంకా నిధులు జమ కాని ఎస్‌హెచ్‌జీ మహిళలకు కూడా నిధులు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- వై.హరిహరనాథ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు

పసుపు రైతుల సదస్సు జయప్రదానికి పిలుపు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు మద్దతు ధర ఇచ్చి నిల్వలను కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఆ పార్టీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 92,225 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, మార్కెట్లో క్వింటా రూ.2,200కు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ధరలు పతనమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1962 మద్దతు ధరకైనా కొనుగోలు చేయాలన్నారు. క్వింటా పసుపుకు రూ.10 వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరారు. పసుపు రైతుల సమస్యలపై చర్చించేందుకు మే 8న దుగ్గిరాలలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును రైతులు జయప్రదం చేయాలన్నారు. పసుపు బోర్డు, విత్తన పరిశోధన సంస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన మిర్చి, పసుపు, మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసరావు, రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

మానసిక దృఢత్వం అవసరం: వీసీ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : యువత మానసికంగా దృఢంగా ఉండాలని.. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్ చెప్పారు. ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన కార్యశాలను వీసీ రాజశేఖర్, సంస్థ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది సైకాలజిస్టులు హాజరయ్యారు. వారికి మానసిక వైద్యం, సీబీటీ, ప్లే థెరపీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ స్పందన ఈడా సంస్థ చేపట్టే కార్యక్రమాలకు ఏఎన్‌యూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే వాటిని సులువుగా అధిగమిస్తారని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శేషగిరిరావు మాట్లాడుతూ భగవద్గీత అధ్యయనం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. స్పందన ఈడా ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ శ్యామ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబంలో జరిగిన దుర్ఘటన మరొకరికి జరగకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. నంబూరులోని ఐదెకరాల స్థలంలో సైకాలజికల్ రీసెర్చ్, వెల్‌నెస్ సెంటర్ నిర్మిస్తామన్నారు. సీడీఈ సంచాలకుడు డాక్టర్ నాగరాజు, ఫౌండేషన్ సంచాలకుడు అంజిరెడ్డి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్వేత, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ చంద్రికారెడ్డి, వివేకానంద ప్రసాద్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్, చిత్రంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శేషగిరిరావు

ఏసీఏ సెంట్రల్ జోన్ అకాడమీ ఛైర్మన్‌గా పురుషోత్తమరావు

విజయవాడ క్రీడలు, మంగళగిరి, న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ అకాడమీ ఛైర్మన్‌గా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కేవీ పురుషోత్తమరావు, కన్వీనర్‌గా గుంటూరు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి డి.రమేష్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి మండలం నవులూరులోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ఏసీఏ సంయుక్త కార్యదర్శి ఎ.రాకేష్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తమరావు మాట్లాడుతూ రూ.3 కోట్లతో ఏసీఏ స్టేడియంలో క్రీడాకారులకు డ్రెస్సింగ్ రూములు, లిఫ్ట్ గదులతో పాటు స్టేడియం చుట్టూ సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయన్నారు. మంగళగిరి పట్టణం నుంచి స్టేడియానికి మధ్యలో రైల్వే ట్రాక్ కింద 'అండర్ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మించాల్సి ఉందని, ఇది ఉంటే రాకపోకలకు ఇబ్బందులు ఉండవని, ఆయన తెలిపారు...[illegible]... ఈ విషయమై మంగళగిరి ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. కేఎస్ భరత్ రానున్న రోజుల్లో టెస్ట్ క్రికెటర్‌గా రాణిస్తాడని ఆశిస్తున్నామన్నారు. సెంట్రల్ జోన్ ఆధార మ్యాచ్‌లకు ఎస్.శ్రీనివాసరెడ్డి శిక్షణ ఇస్తున్నారన్నారు. కన్వీనర్ డి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ... సంఘం సంయుక్త కార్యదర్శి ఎ.రాకేష్ మాట్లాడుతూ 'ఐపీఎల్' మాదిరే ఏసీఏ ఆధ్వర్యంలో గత ఏడాది నుంచి 'ఏపీఎల్' (ఆంధ్రా ప్రీమియర్ లీగ్) ప్రారంభమైందని, దీని ద్వారా క్రికెటర్లకు మంచి అవకాశాలు లభిస్తాయన్నారు.

సినీ, రాజకీయ రంగాల్లో లెజెండ్ ఎన్టీఆర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : తెలుగు భాషకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్, అది ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. ఆదివారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలిలోని ఎన్వీఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కార ప్రదాన సభలో ఆయన మాట్లాడారు. సభకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ఏడాది పాటు ఉత్సవాలు నిర్వహించుకున్న ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. రాజకీయ, సినీ రంగాల్లో ఆయనొక లెజెండ్ అని కొనియాడారు. పురస్కార ప్రదాత, గీతమ్స్ కళాశాల అధినేత ఎం.భరత్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెదేపాను స్థాపించి చాలా మందికి అవకాశం కల్పించారని, ఆయన ఎంతో ధైర్యంతో, నమ్మకంతో తీసుకొన్న ఆ నిర్ణయానికి ప్రతీకగా వారు ఇప్పటికీ కొనసాగుతుండడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురస్కార ప్రదాతలు భరత్, ఆయన సతీమణి తేజస్విని, సినీ కథానాయిక భారతి విష్ణువర్ధన్, ఎన్టీఆర్ మేకప్‌మెన్ దివంగత పీతాంబరం తరఫున ఆయన కుమారుడు పి.వాసులకు ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాలను ప్రదానం చేసి, సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కవి యర్రాప్రగడ రామకృష్ణ అతిథులను సభకు పరిచయం చేశారు. కొండపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, చెన్నపురి తెలుగు అకాడమీ మేనేజింగ్ ట్రస్టీ తూమాటి సంజీవరావు, మలినేని ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్, ఎన్టీఆర్ అభిమాన సత్కార గ్రహీత పాటిబండ్ల జ్యోతి, నందమూరి యశ్వంత్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.రమణ తదితరులు మాట్లాడారు. తొలుత వైద్యురాలు కాలారి శ్రీదేవి ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు.



ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాన్ని అందుకుంటున్న సినీ కథానాయక భారతి విష్ణువర్ధన్



దివంగత పీతాంబరం తరఫున ఆయన కుమారుడు వాసుకు చలనచిత్ర పురస్కారాన్ని అందజేస్తున్న భరత్, తేజస్విని

ఉత్తమ ప్రదర్శనగా 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుంచి 29వ తేదీ వరకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీల విజేతలను న్యాయనిర్ణేతలు ఎ.నర్సిరెడ్డి, బొర్రా నరసయ్య, ప్రసాద్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. అమృతలహరి థియేటర్స్ గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా నాటిక ఉత్తమ, కళాంజలి హైదరాబాదు వారి రైతేరాజు ద్వితీయ, మైత్రీ కళానిలయం వారి ఇతిహాసం తృతీయ ప్రదర్శనగా నిలిచాయని వారు పేర్కొన్నారు. రైతేరాజు నాటిక ఉత్తమ దర్శకత్వ, సంగీత, జ్యూరీ విభాగాల్లోనూ ఎంపికైంది. నాన్నా నేనొచ్చేస్తా నాటిక ఉత్తమ రచన, నటి విభాగాల్లో ఇతిహాసం ప్రదర్శన ద్వితీయ ఉత్తమ నటి, క్యారెక్టర్ నటి, అలంకరణ విభాగాల్లో మనసున మనసై నాటికకు ఉత్తమ నటుడు, హాస్యనటుడు, జ్యూరీ విభాగాల్లో స్వర్ణకమలాలు నాటిక ఉత్తమ ద్వితీయ నటుడు, జ్యూరీ విభాగాల్లో ఐదుపదుల నాటిక క్యారెక్టర్ నటుడు, ఆహార్యంలలో ప్రక్షాళన నాటిక ఉత్తమ విలన్, జ్యూరీ విభాగాల్లో అవార్డులు సాధించాయన్నారు.



నాటికలో ఒక సన్నివేశం

12 నుంచి ఆలిండియా నేషనల్ ర్యాంకింగ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 12 నుంచి 19 వరకు ఆలిండియా నేషనల్ ర్యాంకింగ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ది సిటీ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ సయ్యద్ రసూల్ తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ది సిటీ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో ఏపీ లాన్ టెన్నిస్ అసోసియేషన్, ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ సౌజన్యంతో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 16 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఛాంపియన్‌షిప్ సిరీస్-7 పేరిట గుంటూరులో పోటీలు జరుగుతాయన్నారు. 12వ తేదీ ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 13, 14 తేదీల్లో అర్హత పోటీలు, అర్హత పొందిన క్రీడాకారులకు 15 నుంచి 19వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. బాలురకు ఆఫీసర్స్ క్లబ్, పోలీసు అధికారుల టెన్నిస్ కోర్టుల్లో, బాలికలకు ఎన్టీఆర్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టుల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రధానకార్యదర్శి గంగరాజు జగదీశ చంద్రబాబు మాట్లాడుతూ గెలుపొందిన క్రీడాకారులకు పాయింట్స్ లభిస్తాయన్నారు. పాయింట్స్‌కు అనుగుణంగా ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో, జాతీయ టెన్నిస్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత ఉంటుందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్, కోశాధికారి గంగాధరరావు, సహాయ కార్యదర్శి ఆలపాటి సురేష్, కార్యదర్శి విల్సన్‌బాబు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లకు రూ.71.77 కోట్లు విడుదల

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో వైఎస్ఆర్ పింఛన్ కానుక పథకంలో 2,52,274 మంది లబ్ధిదారులకు రూ.71.77 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో మే 1వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు వై.హరిహరనాథ్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 111, రిటైల్ ధర - 133, చికెన్ విత్‌స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -108 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 420 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.63/-.

బొగ్గు టిప్పర్ ఢీకొని ఆర్టీసీ బస్సు పల్టీ

గుంటూరు వాసులకు గాయాలు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: బొగ్గు టిప్పర్ ఢీకొని బస్సు బోల్తాపడిన సంఘటన తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చుంచుపల్లి మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... భద్రాచలం డిపోనకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు బయల్దేరింది. సుమారు 7 గంటల సమయంలో కొత్తగూడెం పట్టణం దాటి, చుంచుపల్లి మండలంలోని ఆనందఖని జంక్షన్‌కు చేరుకుంది. అదే సమయంలో హైవేకు ఎడమ వైపు నున్న రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటు నుంచి దూసుకొచ్చిన బొగ్గు టిప్పర్ మధ్య భాగంలో అడ్డంగా ఢీకొనడంతో బస్సు రెండు పల్టీలు కొట్టింది. మొత్తం 47 మంది ప్రయాణికులుండగా.. వారిలో 24 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో 8 మందికి తీవ్రంగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో గుంటూరు జిల్లాకు చెందిన నారాయణమ్మ, కోలూరి భారతి ఉన్నారు. వీరిని కొత్తగూడెం పోలీసులు 108 వాహనంలో ఆస్పత్రులకు తరలించారు. బాధితులంతా సింగరేణి ప్రధానాసుపత్రి, జిల్లా సర్వజన ఆసుపత్రి, ఇతర ప్రైవేటు దవాఖానాల్లో చికిత్స పొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. స్వల్ప గాయాలైన వారిలో గుంటూరు జిల్లాకు చెందిన కర్లపూడి చక్రిక, బి.గోపికృష్ణ ఉన్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ మామిడి శివాజీపై పోలీసులు కేసు నమోదు చేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) తెనాలి: 80085 73125 పొన్నూరు: 80085 73144

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

పొన్నూరు, న్యూస్‌టుడే

సమస్య : పట్టణ పరిధిలోని 8వ వార్డుకు వెళ్లే రహదారి మధ్యలో పగుళ్లిచ్చింది. రాకపోకలు నిర్వహించాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. రహదారికి మరమ్మతులు చేపట్టే విధంగా తగు చర్యలు చేపట్టాలి.

- రమేష్‌బాబు, 8వ వార్డు

సమాధానం: రహదారికి మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

సమస్య : పట్టణ పరిధిలోని విద్యానగర్‌లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. రెండు రోజుల నుంచి చెత్త చెదారం తొలగించడం లేదు. ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది.

- పి. వాణి, విద్యానగర్

సమాధానం : పరిసరాలను శుభ్రపరిచే విధంగా తగు చర్యలు తీసుకుంటాం.



స్పందనకు వందనం

పొన్నూరు పట్టణ పరిధిలోని 1వ వార్డులో తాగునీటి ట్యాంకు సమీపంలో మురుగు కాలువకు రెండు వైపులా పిచ్చిమొక్కలు దట్టంగా మొలవడంతో మురుగునీరు ముందుకు కదలక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని గత నెల 27వ తేదీన ప్రజారోగ్యశాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఆ శాఖ అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించారు.

రోడ్డు వెంబడి వ్యర్థాలు తొలగించ లేదు

సమస్య: పట్టణ ఉడా కాలనీ ప్రభుత్వ వైద్యశాల మార్గం రెండో అడ్డరోడ్డు వెంబడి వ్యర్థాల గుట్టలు పడి ఉన్నాయి. వాటిని తొలగించలేదు.

- భానుమతి, ఉడా కాలనీ



సమాధానం: సత్వరం తొలగింపజేస్తాం.



స్పందనకు వందనం

బుర్రిపాలెం రోడ్డులో పరిశుభ్రత చర్యలు: పట్టణ బుర్రిపాలెం రోడ్డు వెంబడి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల మూటల వల్ల దోమలు, దుర్వాసనతో ఇబ్బందిగా ఉందని స్థానికులు 'ఈనాడు' ద్వారా అధికారులకు తెలిపారు. ఏప్రిల్ 29న సమస్యను ప్రచురించాం. స్పందించిన మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగింపచేసి, అంతా శుభ్రం చేసి దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

తెనాలి

• తెనాలి • పొన్నూరు

ఘనంగా అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం వారి ఆధ్వర్యంలో అన్నమయ్య పాటల పోటీలను ఆదివారం స్థానిక గీతామందిరంలో నిర్వహించారు. 80 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.



పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉడా కాలనీలో మురుగు వెతలకు పరిష్కారమెప్పుడు?


సంవత్సరాలుగా ప్రజల ఎదురు చూపులు

న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా చేసిన అధికారులు, పాలకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

తెనాలి పట్టణ పరిధిలోని ప్రధాన నివాస ప్రాంతం ఉడా కాలనీలో సమస్యలు వెంటాడుతున్నాయి. ఇది ప్రభుత్వ వెంచర్. 1983లో 100 ఎకరాలలో ప్రభుత్వమే ఈ కాలనీని ఏర్పాటు చేసింది. సమగ్ర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చి 1300 ప్లాట్లు ప్రజలకు విక్రయించారు. వాటిలో ఇళ్లు నిర్మించుకుని ఇప్పుడు సుమారు 2 వేలకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కానీ నాటి నుంచి నేటి వరకు ప్లాట్లదారులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు.

✪ కాలనీలో ప్రధాన మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువల కోసం ఎదురు చూసి, వినతులు చేసినా ఆయా పాలకులు, అటు అధికారుల్లో చలనం లేకపోవడంతో తుదకు కన్జ్యూమర్ కోర్టు కిందట ఉడా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో కొంత మేరకు రోడ్లు ఏర్పడినా మురుగు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉంది.



మురుగు కాలువపై వాలిపోయిన భారీ చెట్టు, పిచ్చి మొక్కలతో పూడిపోయిన కాలువ

✪ కాలనీలో పూర్తిగా పక్కా కాలువలు ఇంకా నిర్మించలేదు. ఉప వీధుల్లోని చిన్న కాలువలు, ప్రధాన రహదారుల్లోని పెద్ద కాలువలకు అనుసంధానం సరైన రీతిలో జరగలేదు. ఫలితంగా మురుగు ముందుకు కదలక ప్రజలు దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. కచ్చా కాలువల గట్లు తెగిపోయి మురుగు చెంతనే ఉన్న ఖాళీ స్థలాల్లో చేరిన దృశ్యాలు కోకొల్లలు.



మురుగు కాలువలో పొర్లాడుతున్న పంది



కచ్చా కాలువ గట్టు తెగి చెంతనే ఉన్న ఖాళీ స్థలంలో చేరిన మురుగు

✪ పందుల గుంపులు ఈ కాలనీనే నివాసంగా మార్చుకున్నాయా? అన్నట్లు తిరుగుతూ ఉంటాయి, మురుగు కాలువల్లో సేద తీరుతూ కనిపిస్తాయి. నిర్మాణ పరమైన సమస్యలు అటు ఉంచితే కనీసం ప్రతి రోజూ పక్కాగా వాటిని పర్యవేక్షించే పరిస్థితి కనిపించడం లేదు. కాగా ఈ కాలనీలో ఖాళీ స్థలాల విక్రయానికి ఇటీవల ప్రయత్నించిన ప్రభుత్వం, సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపలేదు.

✪ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన తమ సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని, ప్రభుత్వ వెంచర్‌లోనే ఈ తరహా సమస్యలు కొనసాగితే ఇక ఎవరిని ఆశ్రయించాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రిన్సిపల్ నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

హనుమత్ వాహనంపై ఊరేగింపు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని సుందరవల్లి, రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు భక్తులకు కోదండరాముడి అవతారంలో ఆదివారం దర్శనమిచ్చారు.



కోదండరాముడి అలంకరణలో భావనారాయణుడు

భావన్నారాయణ స్వామి ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై ఉంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య ఘనంగా ఊరేగించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని ఆలూరు రోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అంతకు ముందు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

మార్చురీ నిర్మాణానికి ఆర్థిక సాయం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : స్థానిక పినపాడు మహాప్రస్థానంలో మార్చురీ గది నిర్మాణానికి వీర మాచినేని శ్రీనివాస్, తన తండ్రి దివంగత మనోహర్ జ్ఞాపకార్థం రూ.4.50 లక్షల విరాళం అందజేయడం అభినందనీయమని మహాప్రస్థాన సేవా సమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తెనాలిలో దాత నుంచి రూ.4.50 లక్షల విలువైన చెక్కును ఆయన అందుకున్నారు. భౌతికకాయాలు పాడవకుండా ఉంటానికి ఈ మార్చురీ గది ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. దాతా సాంబిరెడ్డి, కొత్త సుబ్రహ్మణ్యం, ముద్దా భక్తిని రమణయ్య, శంకరరావు, తుమ్మల బాపయ్య చౌదరి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మహాప్రస్థాన సేవా సమితి వారికి రూ.4.50లక్షల చెక్కు అందజేస్తున్న దాత శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి, పెదవడ్లపూడి మధ్య ట్రాక్టర్‌ని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఆదివారం బాలుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కానూరులోని సనత్ నగర్‌కు చెందిన సంపత్(17), తన స్నేహితుడు వాసుతో కలిసి ద్విచక్ర వాహనంపై పెదవడ్లపూడిలోని తన స్నేహితుడు వద్దకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో ట్రాక్టర్‌ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న సంతోష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. వెనక కూర్చున్న వాసు గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. 2 లక్షల విలువైన విద్యుత్తు సామగ్రి అందజేత

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన నటరాజ్ జ్యూయలరీస్ అధినేత కొత్తమాసు కుమార్ చినరావూరు ఉద్యానవనానికి రూ.2 లక్షల విలువైన విద్యుత్తు సామగ్రి, దీపాలను ఉచితంగా అందజేయడం అభినందనీయమని 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఉద్యానంలో దాతల నుంచి ఆ సామగ్రి, దీపాలను ఆయన అందుకున్నారు.



వార్డు కౌన్సిలర్ కోటేశ్వరరావుకు విద్యుత్తు సామగ్రి, దీపాలను అందజేస్తున్న దాత కుమార్

ఈ నిధులు.. ఏ మూలకు?

పొన్నూరు, న్యూస్‌టుడే

పేద ముస్లిం వర్గాలు వివిధ శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నారు. వాటిని తొలగించేందుకు గత ప్రభుత్వం షాదీఖానా నిర్మాణ పనులు చేపట్టేందుకు సుమారు రూ.1.50 కోట్ల నిధులు కేటాయించారు. ఆ నిధులతో పనులు ప్రారంభించారు. నిర్మాణం సాగుతుండగా 2019 ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గుత్తేదారుడు పనులు నిలిపివేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులు నిర్వహించేందుకు గుత్తేదారుడు మొగ్గు చూపలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాటి నుంచి నేటి వరకు పనుల్లో పురోగతి సాధించలేకపోయారు. ఆ నిర్మాణ పనులకు ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో భవనం అలంకార ప్రాయంగా మారింది. ఆ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా మొలిచాయి. విషసర్పాలకు సైతం ఆవాస కేంద్రాలుగా మారాయి. షాదీఖానా నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పేద వర్గాలకు ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం షాదీఖానా నిర్మాణ పనులకు రూ.25 లక్షలు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు కేటాయించినప్పటికీ ఎన్నికల ఏడాది కావడంతో బిల్లులు చెల్లింపుపై గుత్తేదారుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. పనులు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతారో లేదో అని అనుమానాలు అందరినీ వెంటాడుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు దాతల సహకారం తీసుకుని నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా తగు ప్రయత్నాలు ప్రారంభించామని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.



అబ్దుల్ కలాం రోడ్డులో పనులు నిలిచిన షాదీఖానా భవనం



గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం చుట్టూ మొలిచిన పిచ్చి మెక్కలు

కాసులిస్తున్నాం.. ఇటు రాకండి!

పొన్నూరు, న్యూస్‌టుడే

నిషేధ ప్లాస్టిక్ కవర్లను నియంత్రించాల్సిన పురపాలక సంఘంలోని ఓ అధికారి ప్రతినెల వ్యాపారుల నుంచి ముడుపులు అందుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కవర్లపై తనిఖీలు కూడా మూణ్నాళ్ల ముచ్చటగా మారాయని పలువురు విమర్శిస్తున్నారు. పొన్నూరు పట్టణ పరిధిలో 31 వార్డులకుగాను 17,500 కుటుంబాలు, 61,500 జనాభా నివసిస్తున్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిషేధం ఉంది. వాటిని వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు చేపడతామని పురపాలక సంఘం అధికారులు ఆర్భాటంగా ప్రకటించారు.



పొన్నూరులో ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ప్లాస్టిక్ కవర్లు



పొన్నూరులో ప్లాస్టిక్ కవర్లలో కాయలు తీసుకెళ్తున్న దృశ్యం

☛ పొన్నూరు పట్టణంలో 25 మంది వరకు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్‌కు సంబంధించిన వ్యాపారాలు రహస్యంగా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కవర్లు విక్రయిస్తున్నారు. నిషేధిత కవర్ల వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిసినా పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి ఒక్కో వ్యాపారి నుంచి నెలకు రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఆ బాధ్యతను ఓ వ్యాపారికి అప్పగించి అందరి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి.

☛ ప్రతి నెల అధికారికి ముడుపులు ఇవ్వడంతో వ్యాపారులు కవర్ల ధరలను సైతం పెంచారు. గతంలో ప్లాస్టిక్ కవర్ ప్యాకెట్ రూ.165లకు విక్రయించగా అదే ప్యాకెట్ కొద్ది రోజుల నుంచి వ్యాపారులు రూ.210కు విక్రయిస్తున్నట్లు చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ వసూలును అడ్డుకట్ట వేసి ప్లాస్టిక్ కవర్లను నియంత్రించే విధంగా తగు చర్యలు చేపట్టాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

☛ దీనిపై ప్రజారోగ్యశాఖ అధికారి ప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని చెబుతున్నామని తనిఖీ చేసి ఇటీవల రూ.10 వేల విలువైన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. డబ్బులు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

చేబ్రోలు, న్యూస్‌టుడే : భర్త అతని అన్న మానసికంగా వేధిస్తుండడంతో వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వెంకటాద్రి వివరాల మేరకు.. మండలంలోని వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ బాజీదీబీ, మాబూ సుభానీకి 2010లో వివాహమైంది. కొంతకాలంగా బాజీదీబీ భర్త మాబూసుభానీ అతని అన్న ఖాజా మొహిద్దీన్ కలిసి ఆమెను మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : భర్త వేధిస్తున్నాడని పట్టణ నాజరుపేటకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు.

'రాష్ట్రంలో అరాచక పాలన'

పొన్నూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందని తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. పిట్టలవానిపాలెంలో దైవ దర్శనానికి వెళ్తూ మార్గం మధ్యలో నిడుబ్రోలులో మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను ఆయన ఆదివారం కలిశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

చలివేంద్రం ప్రారంభం

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలో జనసైనికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన గాదె వెంకటేశ్వరరావు

వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపిక

మే 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో జరిగే సీఎం కప్ పోటీల్లో పాల్గొనే గుంటూరు జిల్లా వాలీబాల్ సీనియర్ జట్టుకు తమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న చంద్రిక, గతేడాది పదో తరగతి చదివిన యామిని ఎంపికయ్యారని పట్టణ చెంచుపేటలోని కోగంటి శివయ్య పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి ఆదివారం తెలిపారు. విద్యార్థినులను, గురువు జె.రమేష్‌ను ఆయన అభినందించారు.



- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

వీరబ్రహ్మేంద్రస్వామికి పంచామృతాభిషేకం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి పరిధిలోని రామచంద్రపాలెంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచి భీమిరెడ్డి అంజిరెడ్డి పర్యవేక్షణలో స్వామికి పంచామృతాభిషేకం చేశారు. ఉత్సవమూర్తులను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

శివాలయంలో కల్యాణ ఉత్సవాలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి(శివాలయం) ఆలయంలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు స్వామి వార్షిక కల్యాణ ఉత్సవాలు జరుగుతాయని ఈవో దుగ్గిరాల చినవెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. 6న రాత్రి 7.35 గంటలకు కల్యాణం ఉంటుందన్నారు.

ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు

తెనాలి (కొత్తపేట), కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, న్యూస్‌టుడే: తెనాలి పట్టణంలోని బోసు రోడ్డులో కొలువైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. లక్ష మల్లెల పుష్పార్చన చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. వల్లభాపురం, కొల్లిపర, మున్నంగి తదితర గ్రామాల్లోని ఆర్యవైశ్య సత్రాల్లో, కల్యాణ మండపాల్లో పండగ వాతావరణం సంతరించుకుంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. పురవీధుల్లో రథోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధ దంపతులకు సత్కారాలు నిర్వహించారు. సంఘ నాయకులు అన్నవరపు రమేష్, వల్లభాపురంలో తాతా సతీష్, తూములూరు పూర్ణచంద్రరావు, మున్నంగి సోమిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు. పొన్నూరు పట్టణ పరిధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు లక్ష మల్లెలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేబ్రోలులోని నిత్యానందాశ్రమంలోని అమ్మవారి ఆలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. 108 మంది మహిళలతో 108 పంచామృత కలశాలతో అమ్మవారి భారీ ప్రతిమను ఊరేగించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పెదకాకాని వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా స్థానిక వాసవీ యూత్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన కూడలి వద్ద మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు.



తెనాలిలో విశేష లక్ష మల్లెల పుష్పార్చన



కొల్లిపర: వల్లభాపురంలో అలంకరణ



పొన్నూరులో వాసవీ అమ్మవారు



చేబ్రోలులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రతిమతో గ్రామోత్సవం



పెదకాకానిలో మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేస్తున్న వాసవీ యూత్ సభ్యులు

అడ్డుగా ఉందని.. అడ్డంగా నరికేశారు



పురపాలక సంఘ కార్యాలయం సమీపంలో యంత్రంతో చెట్టు నరుకుతున్న కార్మికుడు

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు పురపాలక సంఘం కార్యాలయం సమీపంలో రహదారికి రెండు వైపులా ఉన్న చెట్లను అడ్డగోలుగా నరికేశారు. అధికార పార్టీకి చెందిన ఓ నేత ఆ వీధిలో బహుళ అంతస్తు నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయని ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను నరకడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పురపాలక సంఘం కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న చెట్లను నరుకుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. నీడనిచ్చే పచ్చని చెట్లు నరికివేతతో పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

చెరువు కట్టకు మరమ్మతులు చేయాలంటూ ఆందోళన



నిరసన తెలుపుతున్న జనసేన కార్యకర్తలు

ఎర్రబాలెం(మంగళగిరి), న్యూస్‌టుడే: ప్రమాదభరితంగా మారిన ఎర్రబాలెం నల్ల చెరువు కట్టపై రోడ్డు మార్గానికి మరమ్మతులు చేపట్టాలంటూ... జనసేన కార్యకర్తలు ఆదివారం నిరసన తెలిపారు. గ్రామంలోని రామాలయం నుంచి చెరువు కట్ట వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చెరువు కట్టపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రోజూ సచివాలయం, హైకోర్టు, రాజధాని గ్రామాలకు ఇదే మార్గం నుంచి ఆర్టీసీ బస్సులు, వందలాది మంది వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారని, అంతటి ప్రాధాన్యం కలిగిన మార్గంపై ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడం వల్ల నిండు ప్రాణాలు చెరువులో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు గురైన చెరువుకట్ట మార్గానికి మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో సమస్యలపై కూడా ఎమ్మెల్యే స్పందిస్తున్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారని, ఆరు నెలలుగా అనేక సార్లు చెరువు కట్ట పరిస్థితులపై సామాజిక మాధ్యమాల్లో వివరిస్తున్నా పట్టించుకోలేదన్నారు. నాయకులు కాపరౌతు సుందరయ్య, శివనాగేంద్ర, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి ఈత దోహదం



మాట్లాడుతున్న ఆర్పీ సిసోదియా, చిత్రంలో గోకరాజు ఆదిత్యవర్మ తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఈత బాల్యంలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోదియా అన్నారు. ఉండవల్లిలోని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అతిథి గృహం ఈత కొలనులో బాలబాలికలకు ఆక్వా డెవిల్ వెల్ఫేర్ అసోసియేషన్ చేపట్టిన శిక్షణను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్తులో మరికొన్ని క్రీడాంశాలకు కూడా ఈత దోహదపడుతుందన్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలతో పాటు ఈత కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. లైలా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ, అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లింగిపల్లి రామకృష్ణ, కార్యదర్శి మండవాటి నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోజన్ వినియోగంతో వాతావరణానికి మేలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: హైడ్రోజన్ వినియోగంతో కాలుష్య రహిత వాతావరణం సాధ్యమని ప్రొఫెసర్ రంగారావు అన్నారు. ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సు శనివారం ముగిసింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రంగారావు మాట్లాడుతూ... హైడ్రోజన్ పనితీరు, దాని వల్ల కలిగే ఫలితాలపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. జీవరాశులు, మానవులకు ప్రమాదకరమైన అత్యధిక ఉష్ణోగ్రతను హైడ్రోజన్ వాడకంతో తగ్గించవచ్చని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ... జాతీయ సదస్సుల ద్వారా దేశ నలుమూలల నుంచి నిపుణులు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సదస్సులు మరిన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అమరావతి రీజియన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ గోవర్ధనరావు, శాస్త్రవేత్త సీవీ సత్యనారాయణ, అమరావతి రీజియన్ సెంటర్ వైస్ చైర్మన్ నన్నపనేని సాంబశివరావు, కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ల పైనుంచి జారి పడి వివాహిత మృతి



కల్యాణి మృత దేహం

మేడికొండూరు, న్యూస్‌టుడే: మెట్లపై నుంచి జారిపడిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని వరగానికి చెందిన గేరా సుశీల, జోజిప్ప దంపతుల కుమార్తె కల్యాణి(22) మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం జూపూడి గ్రామానికి చెందిన మనోజారు జోజిబాబుతో రెండేళ్ల కిందట వివాహమైంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాదిగా కల్యాణి పుట్టింట్లో ఉంటోంది. శనివారం ఆమె దాబాపైకి ఎక్కింది. కిందకు దిగే సమయంలో మూర్ఛ వచ్చి ఒక్కసారిగా మెట్ల నుంచి జారి కిందకు పడింది. తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం గుంటూరు సర్వజనాసుపత్రి ఆమెను తరలించారు. అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద పద్మజ్యోతి సేవా సంఘం ఆదివారం పేదలకు అల్పాహారం పంపిణీ చేసింది. రాగి జావ 150 మందికి అందజేశారు. న్యాయవాది వేమూరి రత్నప్రసాద్, ఉమారాణి దంపతులు అల్పాహారం పంపిణీని ప్రారంభించారు. సంఘం వ్యవస్థాపకుడు గుంటి వెంకట పూర్ణచంద్రరావు, న్యాయవాది తోటా నరసింహారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి, పెదవడ్లపూడి మధ్య ట్రాక్టర్‌ని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఆదివారం బాలుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కానూరులోని సనత్‌నగర్‌కు చెందిన సంపత్(17), తన స్నేహితుడు వాసుతో కలిసి ద్విచక్ర వాహనంపై పెదవడ్లపూడిలోని తన స్నేహితుడు వద్దకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో ట్రాక్టర్‌ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న సంతోష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. వెనక కూర్చున్న వాసు గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిడమర్రులో చోరీ

మంగళగిరి పరిధిలోని నిడమర్రులో చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన గాదె కోటిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి తాడేపల్లిలోని బంధువుల ఇంటికి శనివారం వెళ్లి ఆదివారం ఉదయం వచ్చారు. ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. బీరువాలో వెండి, బంగారం, సెల్‌ఫోన్ తదితర వస్తువులు చోరీకి గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు.

వ్యవసాయ కూలీలకు గాయాలు

మేడికొండూరు, న్యూస్‌టుడే: పొలం పనికి వెళ్లి వస్తున్న ముగ్గురు వ్యవసాయ మహిళా కూలీలకు గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... సిరిపురంలో మహిళా కూలీలు మిర్చి కాయలు కోసేందుకు పొలం వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి బయలు దేరారు. ట్రాక్టర్ ఎక్కారు. దారిలో గుంతలు ఉండటంతో ట్రక్కు పక్కకు ఒరిగింది. భయపడి ముగ్గురు మహిళలు కిందకు దూకారు. వారి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో షేక్ జాన్‌బీ, షేక్ జాకీర, మరో మహిళను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు.

అధ్వానంగా పెదపరిమి-మోతడక రోడ్డు



తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెదపరిమి నుంచి మోతడక వరకు తారు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ఈ రహదారి మీదుగా భారీ టిప్పర్లు, లారీలు తిరగడంతో కుంగి, బీటలు వారింది. కొన్ని చోట్ల కోతకు గురై కంకర బయట పడింది. ఆదివారం కురిసిన వర్షానికి గుంతల్లో నీరు చేరి ప్రయాణికుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది.

పథకాలున్నా.. అందని నీరు!

పెదనందిపాడు, న్యూస్‌టుడే

రక్షిత మంచి నీటి పథకాలున్న గ్రామ శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. కుళాయిల నుంచి వస్తున్న నీటిని తోడుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో దాదాపు 77 రక్షిత నీటి పథకాలు ఉన్నాయి. వాటికి గతంలో వేసిన ఏసీ పైపులైన్లు పాచిపట్టి నీటి విడుదల సామర్థ్యం తగ్గుతోంది. ఫలితంగా చివరి నివాసాల వారికి కుళాయిల ద్వారా పూర్తిగా నీరు సరఫరా కాక అవస్థలు పడుతున్నారు. కొత్తగా హెచ్‌డీపీఈ పైపులైన్లు వేసి పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పని చేయని వడపోత బావులు

రక్షిత నీటి పథకాల వడపోత బావులు దాదాపు 50 శాతం వరకు పని చేయడం లేదు. అలంకారప్రాయంగా మారాయి. కొన్నిచోట్ల చెరువుల్లో నీరు కొద్ది కాలానికే రంగుమారి వాసన వస్తోంది. ప్రత్యామ్నాయం లేక ప్రజలు వాటినే వాడుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో తాగడానికి బయటి కొంటున్నారు. వరగాని, కారంపూడిపాడు, ముట్లూరు, తెలగాయిపాలెంలో ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ప్రమాదాలు చోటుచేసుకుండా ముందస్తుగానే అధికారులు వాటికి మరమ్మతులు చేయించాలని, లేదంటే కొత్తవి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చెరువులు, వడపోత బావుల్లో జమ్ము, నాచు తదితరాలను తొలగించి, ఇసుక మార్చి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. శుభ్రమైన నీటిని కుళాయిలకు సరఫరా చేయాలి. చెరువుల్లో నీరు రంగుమారకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు.



వరగానిలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

అడుగంటిన చెరువు...

పెదనందిపాడు మండలం జరుగులవారిపాలెంలోని నీరు లేక చెరువు అడుగంటింది. స్థానికులు ఉప్పు నీటినే వాడుకుంటున్నారు. తాగునీటిని చిలకలూరిపేట మండలం మిట్టపాలెం నుంచి తెచ్చుకుంటున్నారు. గ్రామంలో చెరువు అభివృద్ధి చేసేందుకు స్థలం విరాళంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కొందరు గ్రామస్థులు చెబుతున్నారు. పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో కొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పైలెట్ ప్రాజెక్టు పనిచేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు పనిచేస్తే గొట్టపు మార్గంలో పెదనందిపాడు, నాగులపాడు, కొమ్మూరు, గార్లపాడు, పెద్దివారిపాలెం, కాకుమాను, కొండపాటూరు, అప్పాపురం గ్రామాలకు శుభ్రమైన నీరు అందుతుంది.



నాగులపాడులో కుళాయి నీటిని డబ్బాలతో తోడుకుంటున్న మహిళలు

త్వరలో మరమ్మతులు చేయిస్తాం

జలజీవన్ మిషన్ పథకం కింద ప్రత్తిపాడు నియోజకవర్గానికి రూ. 70.90 కోట్లు మంజూరు అయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి చెరువుల, రక్షిత నీటి పథకాలకు మరమ్మతులు చేపడతాం.

- ప్రసాద్, డీఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం

వదలని వర్షం.. తప్పని నష్టం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం కూడా వర్షం పడింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు కర్షకుల చేతికి రాక ముందే దెబ్బతింటున్నాయి. మిరప, పొగాకు, తెల్లజొన్న, మొక్కజొన్న తదితర పంటలు వర్షానికి తడిసి నాణ్యత కోల్పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు.



వట్టిచెరుకూరు: వాలిపోతున్న పొగాకు



వట్టిచెరుకూరు: తెల్లజొన్న పైరులో నిలిచిన వర్షం నీరు



ప్రత్తిపాడు: పట్టాలపై పడిన వాన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం సాయంత్రం గంట పాటు వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబోసిన మిరప పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. కాయలు తడిసి తాలుగా మారుతాయని ఆందోళన చెందుతున్నారు. ఎండ వచ్చినప్పుడు పట్టాలు తీస్తూ మబ్బులు పట్టినప్పుడు కప్పుతూ ఇబ్బందులు పడ్డారు. పట్టాలు ఇలాగే కప్పి ఉంచితే కాయలు కుళ్లిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న, పొగాకు రైతులు సైతం పంటకు నష్టం కలుగుతుందని వాపోతున్నారు.

పాదయాత్రలో తెదేపా నాయకులు



తాడేపల్లి, న్యూస్‌టుడే: తెదేపా తాడేపల్లి మండల నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో కలిసి యువగళం పాదయాత్రలో పాల్గొన్నారు. నందవరం నుంచి ఎమ్మిగనూరు వరకు లోకేశ్ వెంట నడుస్తూ తాడేపల్లి మండలంలో పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించినట్లు కాట్రగడ్డ తెలిపారు.

52 మందికి ఉచిత దంత పరీక్షలు



చికిత్స చేస్తున్న వైద్యురాలు

మెల్లెంపూడి (తాడేపల్లి), న్యూస్‌టుడే: మెల్లెంపూడిలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, మోడ్రన్ డెంటల్ కేర్ సంయుక్తంగా ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. శిబిరాన్ని రోటరీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి ప్రారంభించారు. 52 మందికి ఉచిత దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రోటరీ సభ్యులు ఓబుల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మల్లెపూల పూజ



అలంకరణలో అంకమ్మ తల్లి



పూజలో పాల్గొన్న మహిళలు

కొమ్మూరు (కాకుమాను), న్యూస్‌టుడే: కొమ్మూరులోని అంకమ్మ, పోలేరమ్మ తల్లి తిరునాళ్లను మంగళవారం నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి అమ్మవార్లకు మల్లెపూల పూజ వైభవంగా చేశారు. అంకమ్మ, పోలేరమ్మలను పూలతో అలంకరించారు. తొలుత దంపతులు, దాతలు డప్పు వాయిద్యాలతో మల్లె పూలను ఊరేగిస్తూ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అన్నదానం చేశారు. సోమవారం సాయంత్రం కుంకుమ పూజ, మంగళవారం పొంగళ్ల సమర్పణ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉప్పలపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: ఉప్పలపాడులో మే 2న నిర్వహించే పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా అమ్మవారికి ఆదివారం రాత్రి మహిళలు మల్లెపూలతో పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి విశేష పూజలు, పొంగళ్లు చేసి నైవేద్యాలు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

తిరునాళ్ల ప్రారంభం



వంగిపురం: ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

వంగిపురం (ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: వంగిపురంలో పోలేరమ్మ తిరునాళ్లను ఆదివారం వైభవంగా ప్రారంభించారు. అమ్మవారిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. 1న 108 జలబిందెల పంచామృతాలతో అభిషేకం, కుంకుమార్చన, 2న పొంగళ్ల సమర్పణ, సాయంత్రం శిడిమాను ఉత్సవం, 3న నిత్య పూజ, అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

పెదనందిపాడు, న్యూస్‌టుడే: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. స్వామి జెండాను పెదనందిపాడు, నాగులపాడులో ఊరేగించారు. అన్నదానం నిర్వహించారు.

కాకుమాను, న్యూస్‌టుడే: కాకుమానులోని గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు.

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి పరిధిలోని రామచంద్రపాలెంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచి భీమిరెడ్డి అంజిరెడ్డి పర్యవేక్షణలో స్వామికి పంచామృతాభిషేకం చేశారు. ఉత్సవమూర్తులను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

నాగార్పమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరులో నాగార్పమ్మ తల్లి (కొత్తపల్లివారి) ఆలయంలో అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లి వంశీయులు పూజల్లో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ...

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: నాగులపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు తరలివచ్చి పూజలు, పాలాభిషేకం నిర్వహించారు. పాలకమండలి ఏర్పాట్లను పర్యవేక్షించింది.

పుట్టలమ్మ సేవలో మాజీ మంత్రి



కన్నబాబును సత్కరిస్తున్న పెదకొండూరు వైకాపా నాయకులు

పెదకొండూరు (దుగ్గిరాల), న్యూస్‌టుడే: మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆదివారం పెదకొండూరులోని కనక పుట్టలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. సతీసమేతంగా వచ్చిన ఆయనకు స్థానిక వైకాపా నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు. మొలబంటి శ్రీరామ్మూర్తి, బరమా అర్జున తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో కల్యాణ ఉత్సవాలు

దుగ్గిరాల: స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి(శివాలయం) ఆలయంలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు స్వామి వార్షిక కల్యాణ ఉత్సవాలు జరుగుతాయని ఈవో దుగ్గిరాల చినవెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. 6న రాత్రి 7.35 గంటలకు కల్యాణం ఉంటుందని, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి అభిషేకాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్తిపాడులోని మద్ది సాంబశివరావు నివాసంలో కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా స్థానిక అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో, బాణసంచాతో వైభవంగా ఊరేగించారు. అన్నదానం చేశారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

పాలపర్రు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: పాలపర్రులో నిర్మించిన శ్రీగంగా చతుర్భుజ అన్నపూర్ణాదేవి సమేత సూర్యేశ్వర స్వామి, గంగాపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయాల ప్రారంభం, విగ్రహాల పునః ప్రతిష్ఠోత్సవాలు దేవాదాయ శాఖ, ఆలయాల నిర్మాణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మే 1 నుంచి 5 తేదీ వరకు నిర్వహించనున్నారు. రూ. 3.50 కోట్లతో ఆలయాలను నిర్మించారు. 5న ఉదయం 11.30 గంటలకు విగ్రహాల పునః ప్రతిష్ఠతో పాటు, బొడ్డు రాయి ప్రతిష్ఠ కూడా చేయనున్నట్లు కమిటీ పేర్కొంది.



వేడుకకు సిద్ధమైన ఆలయాలు

పొనుగుపాడులో...

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పొనుగుపాడులోని సీతారామచంద్ర, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు గురువారం వరకు నాలుగు రోజులు నిర్వహించనున్నారు. బుధవారం అన్నదానం ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

భూ సర్వే ప్రారంభం



సర్వేని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొల్లిమర్ల (కాకుమాను), న్యూస్‌టుడే: కొల్లిమర్లలో డ్రోన్‌తో భూముల రీ సర్వేను ఆదివారం ప్రారంభించారు. తహసీల్దారు ప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం, వ్యవసాయ మండలి జిల్లా ఛైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ సర్వేని పరిశీలించారు. సర్వే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఎంపీడీఓ శరత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మంగళగిరి, న్యూస్‌టుడే: పాత మంగళగిరి బైపాస్ రోడ్డు రత్నాల చెరువు అండర్ పాస్ వద్ద మానవ సేవా సంస్థ ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సభ్యులు శ్రీనివాస్, సుధాకర్, గణేష్, వెంకటాద్రి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం నెక్కల్లు సమీపంలోని బ్రహ్మ కుమారిస్ సంస్థకు చెందిన యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటర్‌లో ఆదివారం హ్యాపీ చిల్డ్రన్స్ ఫెస్ట్ నిర్వహించారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులకు ధ్యానం, మానసిక ఉల్లాసానికి సంబంధించిన వివిధ క్రీడలను సంస్థ సభ్యులు నేర్పించారు. విజయవాడ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా ప్రొఫెసర్ రాధిక, బ్రహ్మకుమారీలు శాంత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తల్లీకుమార్తెకు...

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలోని తాలుకా సెంటర్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొని తల్లీ కుమార్తె గాయపడ్డారు. ఆర్టీసీ బస్సు గుంటూరు నుంచి పిడుగురాళ్ల వెళుతోంది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడుకు చెందిన తల్లీకుమార్తె పిల్లి మేరీమాత, మౌనిక సత్తెనపల్లి మండలంలోని నందిగామ వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. తాలూకా సెంటర్‌లో వావిలాల ఇండోర్ స్టేడియం పక్కనే ఉన్న వీధిలో నుంచి ఓ వాహనం వస్తుండటంతో దాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్సును డ్రైవర్ పక్కకు లాగాడు. ఆ సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వైపు నుంచి రోడ్డు దాటుతున్న మేరీమాత, మౌనికను బస్సు ఢీకొంది. వారు బస్సు కింది భాగంలోకి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.



తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఉత్తమ మహిళా పశు వైద్యురాలిగా డాక్టర్ సీకే రావు ఎండోమెంట్ ట్రస్ట్ అవార్డుకు పశుసంవర్ధక శాఖ దుగ్గిరాల సహాయ సంచాలకురాలు డాక్టర్ అపర్ణ ఎంపికయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అప్పలరాజు, ఆ శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. - దుగ్గిరాల, న్యూస్‌టుడే

గుంటూరు తూర్పు

మానవత్వ ప్రేరణే కవుల ధ్యేయం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో ఎన్నో రకాల వాదాలున్నప్పటికీ అంతిమంగా కవుల ధ్యేయం మానవత్వ ప్రేరణేనని సుప్రసిద్ధ కవి, ఆంధ్రప్రదేశ్ ముస్లిం రచయితల సంఘం వ్యవస్థాపకుడు షేక్ కరీముల్లా అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట 2/2లోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో నవ్యాంధ్ర రచయితల సంఘం, డాక్టర్ పట్టాభి కళాపీఠం సంయుక్త నిర్వహణలో సభ జరిగింది. శ్రీశ్రీ జయంతి-మేడే సందర్భంగా కవిమిత్రుల కలయిక, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కరీముల్లా మాట్లాడుతూ ముక్కలవుతున్న సమాజాన్ని కలిపి కుట్టాల్సిన సాహిత్య రంగమే దురదృష్టవశాత్తూ కులాలు, మతాలుగా చీలిపోతున్న విపత్కర పరిస్థితులు పోవాలన్నారు. రచయిత, కవి డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ శ్రీశ్రీ అనే రెండక్షరాలు సమసమాజ నిర్మాణానికి ఎక్కు పెట్టిన రెండు బాణాలు.. సమాజాన్ని నిరంతరం కాపలా కాసే రక్షణకవచాలన్నారు. కార్యక్రమంలో కాలం సాక్షిగా... అనే షేక్ అబ్దుల్ హకీమ్ రాసిన అబాబీలు నూతన కవితా ప్రక్రియ పుస్తకాన్ని కవయిత్రి షేక్ బషీరున్నీసాబేగం సమీక్షించారు. నిమ్మరాజు చలపతిరావు, బండికల్లు జమదగ్ని, బండారు సురేష్, తాటికోల పద్మావతి, పింగళి భాగ్యలక్ష్మి, విజయ గోలి, అనిల్ దార్వేముల, బషీర్, ఖాదర్ బాషా, అబ్దుల్ హకీమ్ తదితర కవులు, కవయిత్రులు శ్రీశ్రీ సాహిత్యంపై మాట్లాడారు. ఈ సందర్భంగా షేక్ కరీముల్లాను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాన్ని కలిమిశ్రీ నిర్వహించారు.



షేక్ కరీముల్లాను సత్కరిస్తున్న కలిమిశ్రీ తదితరులు

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ స్థానం అజరామరం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ స్థానం అజరామరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక బ్రాడీపేట 4/1లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్-జాషువా-ఫులే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ జరిగింది. పాత్రికేయుడు బి.విల్సన్ సభకు అధ్యక్షత వహించారు. తొలుత శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కార్మిక కర్షక జనావళి శుభం కోసం నిరంతరం కవితలు రాసిన శ్రీశ్రీ ముద్ర చెరగనిదన్నారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సామాజిక, సాంస్కృతిక రుగ్మతలకు నాడే ఆయన తన కవిత్వంలో పరిష్కారం చూపారని వివరించారు. కార్యక్రమంలో కవులు ఎస్ఎం సుభానీ, కళాకారులు బాబూరావు, నామతోటి ఉదయ శంకర్, నల్లు నీలాంబరం, బండారు సురేష్‌బాబు, బత్తుల కోటేశ్వరరావు, రేపటి రామ కృష్ణారెడ్డి, రూబీన్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పన్ను వసూళ్లలో జీఎంసీ రికార్డు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నగరాభివృద్ధికి దోహదపడేలా ముందస్తు పన్ను చెల్లించిన ప్రజలను నగరపాలక కమిషనర్ కీర్తి చేకూరి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థకు 2023-24 ఆర్థిక ఏడాదికి సంబంధించి రూ.101 కోట్ల డిమాండ్‌తో ముందస్తు పన్ను వసూళ్లు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా రూ.50 కోట్లు వసూలైందన్నారు. జీఎంసీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం ప్రకటించిన పన్ను రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. గతేడాది నగరపాలక సంస్థ రూ.35.45 కోట్లు మాత్రమే వసూలు జరిగిందని, ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను అధిగమించామన్నారు. మెసేజ్, వాట్సప్, వాల్ పోస్టర్ల ద్వారా ముందస్తు పన్ను చెల్లింపు రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించి, పన్ను వసూళ్లలో చరిత్ర సృష్టించినట్లు ఆమె వెల్లడించారు.



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి

నేడు నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కొనసాగుతుందని, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని అందులో పేర్కొన్నారు.

తాగునీటి పనులు ఇలాగేనా?

గగ్గోలు పెడుతున్న నగరవాసులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

నగరంలోని నెహ్రూనగర్‌లో నూతన తాగునీటి పైపు పనులు అస్తవ్యస్తంగా చేపట్టడంతో స్థానికులు మండిపడుతున్నారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి పలు నివాసాలకు తాగునీటిని సరఫరా చేసే పాత పైపులు తొలగించి కొత్తగా పెద్దవి వేస్తున్నారు. ఇందులో భాగంగా నెహ్రూనగర్‌లోని 6, 7, 8 లైన్లలో గత కొన్ని రోజులుగా రోడ్లు తవ్వి పైపులు అమర్చే పనులు చేపట్టారు. కొన్ని వీధుల్లో పాత పైపులు కోసేసి వదిలేయడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కొన్నింటిని కొత్త పైపులకు అనుసంధానం చేసి, మరికొన్నింటిని కోసేసి రోడ్లపైనే వదిలేయడంతో ఆదివారం తమకు తాగునీరందక అవస్థలు పడ్డామని వాపోయారు. దీనికితోడు గతంలో జీఎంసీ ఏర్పాటు చేసిన వీధి కుళాయిలు తొలగించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏ వీధిలోనైనా తాగునీటి పైపులు పాడైనా, ఇళ్లలో కుళాయిలు లేనివారు వీధి కుళాయిల నీటిని ఉపయోగించుకునే వారమని, ఇప్పుడు అవీ అందుబాటులో లేకుండా పోయాయని పెదవి విరుస్తున్నారు. ఆ వీధుల్లో ఎటుచూసినా రూ.వేలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న జింక్ పైపులను కోసేసి రోడ్లపై అడ్డంగా వదిలేసి వెళ్లిపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరికొన్నిచోట్ల సీసీ రోడ్లను కోసేసి, అందులో కొత్తగా పైపులు వేసి, వాటిపై ప్యాచ్‌వర్కు చేయకుండా వదిలేశారు. ఈ నేపథ్యంలో వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, గోతుల్లో పడి అటు వాహనాల టైర్లు, ఇటు తాగునీటి పైపులు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పైపు పనులు సక్రమంగా పూర్తిచేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్యాచ్ వర్కు చేయకుండా సీసీ రోడ్డులో అమర్చిన పైపు



మెట్లు పగులగొట్టి, భూమి నుంచి పైకి తీసి కోసి వదిలేసిన తాగునీటి పైపులు



నేలపైన కోసి పడేసిన జింక్ పైపులు

సౌత్ డీఎస్పీ మహబూబ్‌బాషా బాధ్యతల స్వీకారం



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు సౌత్ డివిజన్ డీఎస్పీగా మహ్మద్ మహబూబ్ బాషా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ జెస్సీ ప్రశాంతిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న మహబూబ్‌బాషాను ఇక్కడికి వేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తామన్నారు.

ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు



నగరంలోని ఎన్టీఆర్ బస్టాండ్ సెంటర్‌లోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. రైతు బజారు సెంటర్ నుంచి బస్టాండుకు దారిలో నిర్మించిన ఫుట్‌పాత్‌లను కొందరు చిరు వ్యాపారులు ఆక్రమించుకొని పూల బాక్సులు, ఇతర సామగ్రి నింపారు. దీనివల్ల పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలోని మారుమూల ప్రాంతాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. పనులు ముగించుకొని తిరిగి సాయంత్రానికి బస్టాండుకు చేరుకొని గమ్యస్థానాలకు వెళుతుంటారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పట్నంబజారు

శ్రామిక గర్జన జయప్రదానికి పిలుపు



సమావేశంలో పాల్గొన్న మాల్యాద్రి, సురేష్‌బాబు, అంజిబాబు, శివ

నెహ్రూనగర్: కేంద్రంలోని భాజపా ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా సోమవారం నగరంలో శ్రామిక గర్జన నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మాల్యాద్రి తెలిపారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోమవారం నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం నుంచి శ్రామిక గర్జన ప్రదర్శన ప్రారంభం అవుతుందన్నారు. నగరంలోని యావత్తు కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నగర గౌరవ అధ్యక్షులు సురేష్‌బాబు, అధ్యక్షులు అంజిబాబు, నాయకులు శివ పాల్గొన్నారు.

మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మన్ కీ బాత్ వందో ఎపిసోడ్‌ను ఆదివారం నగరంలోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ మన్ కీ బాత్ ద్వారా మన దేశ ఔన్నత్యం, ఎదుగుదలకు కృషి చేస్తున్న ఎంతో మంది విశిష్ట వ్యక్తుల గురించి విద్యార్థులు తెలుసుకుంటున్నారన్నారు. వారిలో ప్రేరణ స్ఫూర్తి నింపేందుకే మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశామన్నారు.



పవిత్ర మాంగల్య దర్శనం... తిలకిస్తున్న భక్తులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి పద్మావతి, గోదా సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మర్రెడ్డి రామకృష్ణా రెడ్డి మృదుల దంపతులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బి. ఉమామహేశ్వరరావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణలలితాంబ దంపతులు, మెట్టు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... **(కిలో ఒక్కింటికి రూలలో)** టమాట 16, వంగ 24, పచ్చిమిర్చి 35, కాకర 38, క్యారెట్ 27, క్యాబేజీ 16, బీర 34, దొండ 12, బంగాళదుంప 22, ఉల్లి పాయలు 17, గోరుచిక్కుళ్లు 28, దోస 20, పొట్ల 22, పెద్ద చిక్కుళ్ళు 95, చామదుంప 48, క్యాప్సికం 44, అల్లం 130, (కాయ ఒక్కింటికి) సొర 10, అరటి 5. -న్యూస్‌టుడే, పట్నంబజారు

వివాహిత బలవన్మరణం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వివాహిత బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిచుకులగుంటకు చెందిన విజయ(30) ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుంది. పని నుంచి ఇంటికి వచ్చిన భర్త దీనిని గమనించి భార్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆయన విజయ తండ్రి వెంకటేశ్వర్లుకు తెలిపారు. ఆయన అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్యామలనగర్‌లో వాచ్‌మెన్...

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఒకరు ఆత్మహత్యపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. బాలునాయక్ (52) శ్యామలనగర్‌లోని సంతోషిమాతా దేవాలయానికి వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. ఆయనకు కీళ్లనొప్పుల వ్యాధి ఉంది. ఆ నొప్పుల బాధను మరిచిపోవాలని మద్యం తాగుతున్నాడు. మద్యం తాగినంత వరకు కీళ్ల నొప్పుల బాధ నుంచి ఉపశమనం కలుగుతున్నప్పటికీ తర్వాత మామూలుగానే ఉంటుంది. దీంతో ఆయన దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారుడు అంజిబాబు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

మందుబాబులపై కేసులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: జిల్లాలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలతో ఆదివారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రహదారుల వెంబడి, పాన్‌షాపులు, కాలువ గట్లు, ఖాళీ స్థలాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.

నగరంపాలెంలో అగ్నిప్రమాదం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ హోటల్ వెనక అపార్టుమెంటులో మంటలు చెలరేగడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల వాషింగ్ మిషన్ దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సీతానగర్ 1వ వీధిలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నీలా శంకర్ రావు, బీసీ విభాగ కార్య నిర్వాహక కార్యదర్శి గట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఉదయం స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, అంతకుముందు సుప్రభాత సేవ చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. తెదేపా తూర్పు ఇన్‌ఛార్జి నసీర్ అహ్మద్ స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ గావించారు. పూజలు చేసిన వారిలో తెదేపా నాయకులు వేములకొండ శ్రీనివాస్, యల్లావుల అశోక్, శివకుమార్, కిరణ్, శంకర్, సోమశేఖర్, బలరాం, ఏడుకొండలు, హుస్సేన్, రమేష్, నరసింహారావు, శ్రీనివాసరావు, కన్నా, గురుబ్రహ్మం, మోహన్‌రావు తదితరులున్నారు.



పూజలో పాల్గొన్న నసీర్ అహ్మద్, శ్రీనివాస్, అశోక్ తదితరులు

శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి జయంతి

పట్నంబజారు: నగరంలోని ఏటుకూరు రోడ్డులోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం అమ్మవారి జయంతి ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 108 కలశాలతో గ్రామోత్సవం జరిపి, అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు మహిళలకు పసుపుకుంకుమలు అందజేసి 101 నిమ్మపండ్ల నోము జరిపారు. ఆలయ ఈవో పాదర్తి దుర్గారావు, ప్రముఖులు ఎ.నగేష్‌కుమార్, కోట వెంకటశేషగిరి, తూనుగుంట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

కూలిన నిఘా నేత్రాలు

పోలీసు శాఖ ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు ఈదురుగాలులకు కూలిపోతున్నాయి. సంజీవనగర్ రైల్వేగేటు దిగువన ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు స్తంభంతో కూలి రోడ్డుకడ్డంగా పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది. అధికారులు స్పందించి రోడ్డుకడ్డంగా పడిపోయిన నిఘానేత్రాలు, అనుసంధానం చేసిన తీగలు, స్తంభాన్ని తొలగించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, నెహ్రూనగర్

ఇన్‌ఛార్జులను నియమించే యోచనలో ఎమ్మెల్యే..?

అసమ్మతి బాటలో కార్పొరేటర్లు!

ఈనాడు-అమరావతి

గుంటూరు తూర్పు నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే ముస్తాఫా చర్యలను నిరసిస్తూ ఆ నియోజకవర్గానికి చెందిన కొందరు వైకాపా కార్పొరేటర్లు ఆదివారం రాత్రి ట్రావెలర్స్ బంగ్లాలో సమావేశయ్యారు. కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించే డివిజన్లలో ఇన్‌ఛార్జిలను పెట్టి వారితోనే ఇకపై ఆయా డివిజడిన్లలో ప్రజా సమస్యలు పరిష్కరించాలనే యోచనలో ఎమ్మెల్యే ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగా ఇప్పటికే పొన్నూరు రోడ్డులో ఓ కార్పొరేటర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లో ఎమ్మెల్యే పార్టీకి చెందిన మరొకరిని ఇన్‌ఛార్జిగా పెట్టి ఆయన చెప్పిన పనులు చేయాలని ఆ డివిజన్‌లోని సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు సంకేతాలిచ్చారని పలువురు కార్పొరేటర్లు చెబుతున్నారు. దీన్ని అడ్డుకునేందుకు పలువురు వైకాపా కార్పొరేటర్లు సమావేశమైనట్లు తెలిసింది. ఈ విషయమై సమావేశానికి హాజరైన పలువురు కార్పొరేటర్లను 'ఈనాడు' సంప్రదించగా ఇది సాధారణ కలయికేనని తమకు ఎవరిపైనా అసమ్మతిలేదని, ఎవరికీ వ్యతిరేకంగా తాము సమావేశం కాలేదని చెప్పారు. తాము ఇప్పటివరకు ట్రావెలర్స్ బంగ్లాను ఒక్కరోజు కూడా వినియోగించుకోలేదని అందులో భాగంగానే కొద్దిసేపు అందులో కూర్చొని సరదాగా గడిపామని తెలిపారు.

నిరుపయోగంగా అన్న క్యాంటీన్‌లు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

గత ప్రభుత్వం హయాంలో పేదలకు రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడానికి నగరంలోని ప్రధాన కూడళ్లలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండు కూడలి, నల్లచెరువు, అమరావతి రోడ్డు, గుజ్జనగుండ్ల, చుట్టుగుంట తదితర ప్రాంతాల్లో భవనాల నిర్మాణానికి రూ.లక్షల నిధులు వెచ్చించారు. నాడు అన్న క్యాంటీన్ల వద్ద రోజుకి వెయ్యి మంది వరకు ఆకలి తీర్చుకున్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోజన పథకాన్ని రద్దుచేసి, అన్న క్యాంటీన్లను మూసివేసింది. వాటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భవనాలకు అధికార పార్టీ రంగులేసి వదిలేశారు. కొన్నిచోట్ల అసాంఘిక శక్తులు తమ కార్యకలాపాలకు ఈ భవనాలను వాడుకుంటున్నాయి. మరికొన్నిచోట్ల తాగుబోతులు బహిరంగంగా వినియోగిస్తున్నా అడ్డుకోకపోవడం దారుణం. ఇక నల్లచెరువు ప్రాంతంలోని క్యాంటీన్ భవనాన్ని అనధికారికంగా నగరపాలక సంస్థ సిబ్బంది వినియోగించుకుంటున్నారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న భవనంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. తలుపులు ధ్వంసమయ్యాయి.

గుజ్జనగుండ్లలోని భవన సమీపంలో ప్రజలు గుడి నిర్మాణానికి సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇకనైనా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు, పాలకులు దృష్టి సారించి అన్న క్యాంటీన్ల భవనాలను ప్రభుత్వ కార్యకలాపాలు, ఇతర ప్రజోపయోగ పనులకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



బస్టాండు కూడలిలో ఇలా..



గుజ్జనగుండ్లలో భవనం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



లోపల పెరిగిన గడ్డి

జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి

గుంటూరుక్రీడలు,న్యూస్‌టుడే: జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు రాయపాటి రంగబాబు సూచించారు. ఆదివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. రంగబాబు మాట్లాడుతూ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వేసవి శిక్షణా శిబిరాలు జరుగుతున్నాయని, వాటిల్లో ప్రతిభావంతులైన క్రీడాకారుల్ని తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యవర్గంలోకి కొందర్ని తీసుకున్నారు. ఉపాధ్యక్షులుగా సతీష్ చంద్ర, కార్యదర్శిగా సురేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం రంగబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, రమేష్‌కుమార్, వెంకటేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరమాధురి సంస్థ ఆధ్వర్యంలో పలువురు ఔత్సాహిక కళాకారులతో ఆదివారం రాత్రి ఎన్నాళ్లో వేచిన ఉదయం పేరున సంగీత విభావరి జరిగింది. శెట్టి థామస్, మేకల పురుషోత్తమ ప్రసాద్, మిరియాల ప్రసాదరావు, చీకటి రవికాంత్, దొప్పలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ సీవీఎస్ రామకృష్ణ, డక్కుమళ్ల ఆదాం, పాగళ్ల మోహనరావు, అత్తోట సౌజన్య, చింతా రజని పలు పాటలను ఆలపించారు. కార్యక్రమాన్ని పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, అన్నదాన సమాజ ఛైర్మన్ పోకల వసంత్, కాపునాడు ప్రధాన కార్యదర్శి రాగం సదాశివరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. భారతీ సంగీత సాంస్కృతిక కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, మిరియాల గోపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.



సమస్య : ఏటి అగ్రహారం రామిరెడ్డినగర్ 7వ లైన్‌లోని సైడు కాలువల్లో కొన్ని రోజుల నుంచి పూడిక తీయకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా మురుగు రోడ్డు మీదకు చేరుతోంది. ఫలితంగా ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – జకరయ్య, రామిరెడ్డినగర్

సమాధానం : సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – ఆనందకుమార్, శానిటరీ సూపర్‌వైజర్

– న్యూస్‌టుడే, ఏ.టి.అగ్రహారం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-4 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల వార్షిక మరమ్మతుల వల్ల సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ పీహెచ్ ఖాన్ తెలిపారు. దీనివల్ల గాంధీనగర్, ఆర్టీసీ కాలనీ, నందివెలుగురోడ్డు, నవభారత్‌నగర్, దానమ్మ హోటల్ సెంటర్, రాఘవనగర్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మానవత్వ ప్రేరణే కవుల ధ్యేయం



కార్యక్రమంలో డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో ఎన్నో రకాల వాదాలున్నప్పటికీ అంతిమంగా కవుల ధ్యేయం మానవత్వ ప్రేరణేనని సుప్రసిద్ధ కవి, ఆంధ్రప్రదేశ్ ముస్లిం రచయితల సంఘం వ్యవస్థాపకుడు షేక్ కరీముల్లా అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట 2/2లోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో నవ్యాంధ్ర రచయితల సంఘం, డాక్టర్ పట్టాభి కళాపీఠం సంయుక్త నిర్వహణలో సభ జరిగింది. శ్రీశ్రీ జయంతి-మేడే సందర్భంగా కవి మిత్రుల కలయిక, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కరీముల్లా మాట్లాడుతూ ముక్కలవుతున్న సమాజాన్ని కలిపి కుట్టాల్సిన సాహిత్య రంగమే దురదృష్టవశాత్తూ కులాలు, మతాలుగా చీలిపోతున్న విపత్కర పరిస్థితులు పోవాలన్నారు. రచయిత, కవి డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ శ్రీశ్రీ అనే రెండక్షరాలు సమసమాజ నిర్మాణానికి ఎక్కు పెట్టిన రెండు బాణాలు.. సమాజాన్ని నిరంతరం కాపలా కాసే రక్షణకవచాలన్నారు. కార్యక్రమంలో కాలం సాక్షిగా... అనే షేక్ అబ్దుల్ హకీమ్ రాసిన అబాబీలు నూతన కవితా ప్రక్రియ పుస్తకాన్ని కవయిత్రి షేక్ బషీరున్నీసాబేగం సమీక్షించారు. నిమ్మరాజు చలపతిరావు, బండికల్లు జమదగ్ని, బండారు సురేష్, తాటికోల పద్మావతి, పింగళి భాగ్యలక్ష్మి, విజయ గోలి, అనిల్ దార్వేముల, బషీర్, ఖాదర్ బాషా, అబ్దుల్ హకీమ్ తదితర కవులు, కవయిత్రులు శ్రీశ్రీ సాహిత్యంపై మాట్లాడారు. ఈ సందర్భంగా షేక్ కరీముల్లాను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాన్ని కలిమిశ్రీ నిర్వహించారు.



షేక్ కరీముల్లాను సత్కరిస్తున్న కలిమిశ్రీ తదితరులు

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ స్థానం అజరామరం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ స్థానం అజరామరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక బ్రాడీపేట 4/1లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్-జాషువా-పులే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ జరిగింది. పాత్రికేయుడు బి.విల్సన్ సభకు అధ్యక్షత వహించారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కార్మిక కర్షక జనావళి శుభం కోసం నిరంతరం కవితలు రాసిన శ్రీశ్రీ ముద్ర చెరగనిదన్నారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సామాజిక, సాంస్కృతిక రుగ్మతలకు నాడే ఆయన తన కవిత్వంలో పరిష్కారం చూపారని వివరించారు. కార్యక్రమంలో కవులు ఎస్ఎం సుభానీ, కళాకారులు బాబూరావు, నామతోటి ఉదయ శంకర్, నల్లపు నీలాంబరం, బండారు సురేష్‌బాబు, బత్తుల కోటేశ్వరరావు, రేపటి రామకృష్ణారెడ్డి, ఝాన్సీ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి తోడ్పాటు

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రమాదంలో కాళ్ల కదలిక కోల్పోయినా జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్న శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం సంతవురిటికి చెందిన పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి పడాల రూపాదేవికి గుంటూరు జేకేసీ కళాశాల ప్రాచ్యభాషా విభాగాధిపతి డాక్టర్ శంకరసాయిబాబు రూ.20 వేలు అందజేశారు. 'ఈనాడు వసుంధర', 'ఈటీవీ-యువ'లో వచ్చిన కథనంతోపాటు 'ఈనాడు' ఛైర్మన్ రామోజీరావు స్ఫూర్తితో తనకు చేతనైనంత సహాయం చేయాలని అనిపించి తోడ్పాటు అందించినట్లు శంకరసాయిబాబు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆయన గూగుల్‌పే ద్వారా రూపాదేవికి పంపారు.

పన్ను వసూళ్లలో జీఎంసీ రికార్డు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నగరాభివృద్ధికి దోహదపడేలా ముందస్తు పన్ను చెల్లించిన ప్రజలకు నగరపాలక కమిషనర్ కీర్తి చేకూరి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థకు 2023-24 ఆర్థిక ఏడాదికి సంబంధించి రూ.101 కోట్ల డిమాండ్‌తో ముందస్తు పన్ను వసూళ్లు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా రూ.50 కోట్లు వసూలైందన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

జీఎంసీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం ప్రకటించిన పన్ను రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. గతేడాది నగరపాలక సంస్థకు రూ.35.45 కోట్లు వసూళ్లు జరిగిందని, ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను అధిగమించామన్నారు. మెసేజ్, వాట్సప్, వాల్‌పోస్టర్ల ద్వారా ముందస్తు పన్ను చెల్లింపు రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించి, పన్ను వసూళ్లలో చరిత్ర సృష్టించినట్లు ఆమె వెల్లడించారు.

నేడు నగరపాలకసంస్థలో స్పందన కార్యక్రమం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కొనసాగుతుందని, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని అందులో పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరమాధురి సంస్థ ఆధ్వర్యంలో పలువురు ఔత్సాహిక కళాకారులతో ఆదివారం రాత్రి ఎన్నాళ్లో వేచిన ఉదయం పేరున సంగీత విభావరి జరిగింది. శెట్టి థామస్, మేకల పురుషోత్తమ ప్రసాద్, మిరియాల ప్రసాదరావు, చీకటి రవికాంత్, దొప్పలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ సీవీఎస్ రామకృష్ణ, డక్కుమళ్ల ఆదాం, పాగళ్ల మోహనరావు, అత్తోట సౌజన్య, చింతా రజని పలు పాటలను ఆలపించారు. కార్యక్రమాన్ని పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, అన్నదాన సమాజ ఛైర్మన్ పోకల వసంత్, కాపునాడు ప్రధాన కార్యదర్శి రాగం సదాశివరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. భారతీ సంగీత సాంస్కృతిక కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, మిరియాల గోపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జాస్తి వీరాంజనేయులు, పక్కన వసంత్ తదితరులు

కోదండరామాలయంలో....

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక నల్లచెరువు నాలుగో లైనులోని కోదండ రామాలయంలో ఆదివారం రాత్రి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాల సందర్భంగా స్వరనాగ సుధ ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన విభావరి జరిగింది. కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి, విజయలక్ష్మి, రవికుమార్ పలు గీతాలను ఆలపించారు. కీబోర్డుపై మన్నవ రామకృష్ణ, తబలాపై షణ్ముఖ శర్మ సహకరించారు.



క్రీడాస్థలి పుస్తకావిష్కరణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అథ్లెటిక్స్ కోచ్ మనోహర్ రచించిన క్రీడాస్థలి పుస్తకాన్ని శాప్ మాజీ ఛైర్మన్ అంకమ్మచౌదరి ఆవిష్కరించారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. అంకమ్మ చౌదరి మాట్లాడుతూ కోచ్‌గా మనోహర్ పనిచేస్తున్న సమయంలో ఎంతో మంది క్రీడాకారుల్ని తయారు చేశారన్నారు. మనోహర్ మాట్లాడుతూ తన వద్ద శిక్షణ తీసుకున్న క్రీడాకారుడు ఉన్నత శిఖరాలకు చేరితే గురువులు పరిపూర్ణ ఆనందాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రోగ్రెసివ్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శేషయ్య, డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, కిషోర్, నిర్వాహకులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. మనోహర్, సీత దంపతులను సత్కరించారు.

క్రీడాంశాల్లో శిక్షణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం నెక్కల్లు సమీపంలోని బ్రహ్మ కుమారిస్ సంస్థకు చెందిన యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటర్‌లో ఆదివారం హ్యాపీ చిల్డ్రన్స్ ఫెస్ట్ నిర్వహించారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులకు ధ్యానం, మానసిక ఉల్లాసానికి సంబంధించిన వివిధ క్రీడలను సంస్థ సభ్యులు నేర్పించారు. విజయవాడ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా ప్రొఫెసర్ రాధిక, బ్రహ్మకుమారీలు శాంత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన గార్డెన్స్ కాపిటల్ హోటల్‌లో ఆదివారం గుంటూరు హిందూ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, వారికి విద్యాబోధన చేసిన అధ్యాపకులకు అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి, ఇంటర్ ఇంఛార్జ్ డాక్టర్ అబ్బరాజు మంజుశ్రీ తదితరులు సీనియర్ ఇంటర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల విద్యావిషయ సమన్వయ కర్త కె.కాళిదాసు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి పీవీ రాము పాల్గొన్నారు.

సౌత్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు సౌత్ డివిజన్ డీఎస్పీగా మహ్మద్ మహబూబ్ బాషా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ జెస్సీ ప్రశాంతిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆధికారులు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న మహబూబ్‌బాషాను ఇక్కడికి వేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తామన్నారు.

శ్రామిక గర్జన జయప్రదానికి పిలుపు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా సోమవారం నగరంలో శ్రామిక గర్జన నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మాల్యాద్రి తెలిపారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోమవారం నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం నుంచి శ్రామిక గర్జన ప్రదర్శన ప్రారంభం అవుతుందన్నారు. నగరంలోని యావత్తు కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నగర గౌరవ అధ్యక్షులు సురేష్ బాబు, అధ్యక్షులు అంజిబాబు, నాయకులు శివ పాల్గొన్నారు.

నగరంపాలెంలో అగ్నిప్రమాదం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ హోటల్ వెనక అపార్టుమెంటులో మంటలు చెలరేగడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల వాషింగ్ మిషన్ దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైభవంగా ఆవిర్భావ దినోత్సవం




సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక వల్లూరివారితోటలోని శ్రీవీరప్రతాప ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం నిమిషాంబాదేవి ఆవిర్భావ దినోత్సవం వైభవంగా ప్రారంభమైంది.. సంఘ అధ్యక్షుడు వీరభద్ర నాగరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపు, కుంకుమపూజ తదితరాలు జరిగాయి. కుంకుమపూజలో పాల్గొన్న మహిళలకు పూజా సామగ్రిని అందించారు. సంగు అరుణ్ కుమార్ వర్మ, పద్మినీ రాధిక దంపతులు, ఉపాధ్యక్షుడు యకమా నాగేశ్వరరావు వర్మ, కార్యదర్శి యకమా నాగసురేష్, సంఘ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శ్రీనివాస కల్యాణం..

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి పద్మావతి, గోదా సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మర్రెడ్డి రామకృష్ణా రెడ్డి మృదుల దంపతులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బి.ఉమామహేశ్వర రావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణలలితాంబ దంపతులు, మెట్టు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పవిత్ర మాంగల్య దర్శనం



తిలకిస్తున్న భక్తులు

కనుల పండువగా పుష్ప యాగం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో పుష్పయాగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మెట్టు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




హిమోఫిలియా బాధితులను గుర్తించాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: హిమోఫిలియా బాధితులను త్వరగా గుర్తించగలిగితే చికిత్స అందించడం తేలికవుతుందని పాథాలజీ విభాగం అధిపతి ఆచార్య అపర్ణ సూచించారు. గుంటూరు వైద్య కళాశాలలో ఆదివారం విద్యార్థి వైద్యులకు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రాంతీయ వైద్య విద్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ ఈ వ్యాధిగ్రస్థుల్లో రక్తానికి గడ్డ కట్టే గుణం తక్కువగా ఉంటుందన్నారు. దాంతో ఏదైనా గాయం అయినప్పుడు లేదా ప్రమాదం జరిగినప్పుడు రక్తం ఆగకుండా స్రవిస్తుందన్నారు. అందుకే వెంటనే వైద్యం అందించాలన్నారు. అదే విధంగా బాధితులను గుర్తించేందుకు విరివిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం డాక్టర్ అహ్మద్ మాట్లాడుతూ శరీరంలోని ప్రతి కణానికీ అనుక్షణం ప్రాణవాయువును అందిస్తూ మనిషిని జవజీవాలతో ఉంచే రక్తం కూడా క్యాన్సర్ బారిన పడుతుందన్నారు. దాన్నే బ్లడ్‌క్యాన్సరనీ, లుకేమియా అనీ అంటారన్నారు. పిల్లలకు వచ్చే క్యాన్సర్లలో లుకేమియా ఎక్కువన్నారు. దాన్ని త్వరగా గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆ తర్వాత వారు ఆరోగ్య జీవితం గడపడం సాధ్యమేనన్నారు. కార్యక్రమానికి వివిధ వైద్య కళాశాలల బోధనానిపుణులు, విద్యార్థి వైద్యులు హాజరయ్యారు.

జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి

గుంటూరుక్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు రాయపాటి రంగబాబు సూచించారు. ఆదివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. రంగబాబు మాట్లాడుతూ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వేసవి శిక్షణా శిబిరాలు జరుగుతున్నాయని, వాటిల్లో ప్రతిభావంతులైన క్రీడాకారుల్ని తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యవర్గంలోకి కొందర్ని తీసుకున్నారు. ఉపాధ్యక్షులుగా సతీష్ చంద్ర, కార్యదర్శిగా సురేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం రంగబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు, సంపత్ కుమార్, రమేష్‌కుమార్, వెంకటేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.



రాయపాటి రంగబాబును సత్కరిస్తున్న దామచర్ల శ్రీనివాసరావు తదితరులు

రెప్కో బ్యాంకు నూతన డిపాజిట్ పథకం

పట్నంబజారు, న్యూస్‌టుడే: రెప్కో బ్యాంకు నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చీఫ్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 8.05 శాతం, సాధారణ సిటిజన్లకు 7.5 శాతం వరకు వడ్డీ అందజేస్తున్నామని తెలిపారు. బంగారు నగలపై అత్యధికంగా రూ.4,450 ఇస్తున్నామని వెల్లడించారు. ఆసక్తి గలవారు బ్రాడీపేట 4వ లైనులోని శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య అవగాహన సభ

అరండల్‌పేట, న్యూస్‌టుడే: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ జరిగింది. ప్రముఖ అంకాలజిస్ట్ టీవీ రామకృష్ణ పాల్గొని క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సభకు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు.

వివాహిత బలవన్మరణం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వివాహిత బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిచుకులగుంటకు చెందిన విజయ(30) ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుంది. పని నుంచి ఇంటికి వచ్చిన భర్త దీనిని గమనించి భార్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆయన విజయ తండ్రి వెంకటేశ్వర్లుకు తెలిపారు. ఆయన అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్యామలనగర్‌లో వాచ్‌మెన్...

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఒకరు ఆత్మహత్యపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. బాలునాయక్ (52) శ్యామలనగర్‌లోని సంతోషిమాతా దేవాలయానికి వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. ఆయనకు కీళ్లనొప్పుల వ్యాధి ఉంది. ఆ నొప్పుల బాధను మరిచిపోవాలని మద్యం తాగుతున్నాడు. మద్యం తాగినంత వరకు కీళ్ల నొప్పుల బాధ నుంచి ఉపశమనం కలుగుతున్నప్పటికీ తర్వాత మామూలుగానే ఉంటుంది. దీంతో ఆయన దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారుడు అంజిబాబు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

వచన కవితా పోటీల ఫలితాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం- విశాలాంధ్ర దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యువ వచన కవితా పోటీల్లో విజేతలను అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో హైదరాబాదు పఠాన్‌చెరువుకు చెందిన సీహెచ్. శ్రీకళ కవిత తరుణమిదే ప్రథమ బహుమతిని, జగిత్యాల జిల్లాకు చెందిన చిందం రమేష్ కవిత చెల్లనిరూపాయి ద్వితీయ బహుమతిని, మహబూబాబాద్ జిల్లాకు చెందిన చిర్ర సతీష్ కవిత అవును మాదే తృతీయ బహుమతిని పొందాయి. అనంతపురానికి చెందిన కోనేటి నరేష్ కవిత అసమాన భారతమా! ప్రోత్సాహక బహుమతిని పొందింది.

మన్‌కీ బాత్ వీక్షణ

బ్రాడీపేట, న్యూస్‌టుడే: బ్రాడీపేటలోని శ్రీమేధ కళాశాలలో ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను ఆదివారం విద్యార్థులతో కలిసి కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, భాజపా లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ జూపూడి రంగరాజు వీక్షించారు. ఈ సందర్భంగా వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మోదీ స్వయంగా దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియ చేసే కార్యక్రమమే మన్‌కీ బాత్ అన్నారు. భాజపా నాయకులు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రకాశరావు, శ్రీనివాస్ తదితరులు నగరంలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాన్ని వీక్షించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో కొత్తపేటలోని అహల్యా ఆసుపత్రిలో మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ నేతృత్వంలో భాజపా మండల నాయకులు వీక్షించారు. పార్టీ నాయకులు సురేష్‌జైన్, పోతురాజు వెంకట్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జయప్రకాష్ నారాయణ తదితరులు